
# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
3-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 161

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# కాంగ్రెస్‌లో నిస్తేజం!




**కనిపించని వెయ్యి రోజుల పాలన సందడి**

**వేడుకలు జరుపుకోని హస్తం శ్రేణులు**

**నేతల మధ్య విభేదాలు, పడిపోతున్న గ్రాఫ్ కారణం**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణలో రేవంత్ సర్కార్ వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంది. సాధారణంగా ఏ ప్రభుత్వానికైనా వెయ్యి రోజుల పాలన అనేది ఒక పెద్ద మైలురాయి లాంటిది. ఇలాంటి సందర్భాల్లో పథకాల ప్రచారం, భారీ బహిరంగ సభలు, పత్రికల్లో ప్రకటనలు, పార్టీ శ్రేణుల సంబరాలతో వాతావరణం పండగల మారడం ఆనవాయితీ. కానీ తెలంగాణ కాంగ్రెస్లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి. ప్రభుత్వపరంగా కానీ.. పార్టీ యంత్రాంగం వైపు నుంచి కానీ ఎలాంటి పెద్ద సంబరాలు అంటూ లేవు. మంత్రుల సైతం లైట్ తీసుకున్నారు.

- మిగతా 3వ పేజీలో

# వ్యూహమా? వ్యూహాత్మక తప్పిదమా?!



**తిరుగుబాటు నేతలపై చర్యల్లో వెనుకబాటు**

**ధైర్యం చేయలేకపోతున్న కాంగ్రెస్ హై కమాండ్**

**పట్టు తగ్గుతున్న స్థానిక నాయకత్వం**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**
కానీ కాంగ్రెస్ నిర్ణయం ఎప్పుడు ఉంటుంది అని చెప్పలేం. క్రమశిక్షణ రాహిత్యం పై కఠిన చర్యలు తీసుకోవడంలో ఆ పార్టీ స్టైల్ వేరు. ఎప్పుడు ఆచితూచి అడుగులు వేస్తుందే తప్ప.. క్రమశిక్షణ చర్యలు వెంటనే తీసుకోదు. వారు పార్టీకి తీవ్ర స్థాయిలో నష్టం చేకూర్చే వరకు, స్వయంగా నిష్క్రమించే వరకు వేచి చూడడం కాంగ్రెస్ సాంప్రదాయ శైలి..



- మిగతా 2వ పేజీలో

తెలంగాణ కాంగ్రెస్ లో కఠిన చర్యలకు ఏఐసీసీ దిగే అవకాశం ఉందా? అంతటి సాహసం ఆ పార్టీ చేయగలదా? అంటే కాదనే సమాధానం వినిపిస్తోంది. ఎందుకంటే అది కాంగ్రెస్ కాబట్టి. మంత్రి సురేఖతోపాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసింది. నివేదిక హై కమాండ్ కు వెళ్ళింది.



# కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై వేటు!

**సీరియస్ నిర్ణయం దిశగా కాంగ్రెస్ హై కమాండ్**

**ఢిల్లీలో సాగిన విస్తృత చర్చలు**

**పదవి కాపాడుకునేందుకు సురేఖ ప్రయత్నాలు**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ వ్యవహారాలపై కాంగ్రెస్ పార్టీ పూర్తిగా దృష్టి పెట్టిందా? కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై ఒక నిర్ణయానికి వచ్చిందా? వారి పదవులు పోవడం ఖాయమా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి.

# ఏంటి 'సర్' ఈ ప్రక్రియ!

**తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అస్తవ్యస్తం**

**నోటీసులలో తీవ్ర జాప్యం**

**అందని వారిలో అర్హులు ఉంటే ఓటుపోయినట్టే**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**
ఓటర్ల జాబితాను వేగంగా ప్రక్షాళన చేయాలన్న భావనతోనే ఎన్నికల సంఘం సర్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ విధానం మంచిదే అయినా.. ఎన్నికల సంఘం వెళ్తున్న తీరు మాత్రం విమర్శలకు తావిస్తోంది.

- మిగతా 2వ పేజీలో



# బహుళ అంతస్తులపై 'ఫైర్'

**భాగ్యనగరంలో అగ్నిమాపక నిబంధనలు పాటించని భవనాలు ఎన్నో**

**ఇటీవల జోరుగా అగ్ని ప్రమాదాలు**

**విస్తృత తనిఖీలకు జిహెచ్ఎంసి సిద్ధం**

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** తెలంగాణ అగ్నిమాపక శాఖ జూలు విదిల్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బహుళ అంతస్తులను తనిఖీ చేయనుంది. ఇటీవల అగ్ని ప్రమాదాలు పెరుగుతుండడంతో అసలు నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అని తెలుసుకునేందుకు

# తిరుమలలో అవినీతి అధికారి!

**రూ.100 కోట్లకు పైగా అక్రమస్తులతో టీటీడీ డిప్యూటీ ఈవో మెండు లోకనాథం**

**ఏసీబీ తనిఖీలతో గుట్టు రట్టు**




**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ జూలు విదిల్చింది. 100 కోట్ల రూపాయల అవినీతి అధికారిని పట్టుకుంది. ఇప్పటివరకు తెలంగాణ ఏసీబీ మాత్రమే దూకుడుగా వ్యవహరిస్తూ వచ్చింది. కానీ ఇప్పుడు ఆ వంతు ఏపీ ఏసీబీకి రావడం విశేషం.

- మిగతా 2వ పేజీలో



## ఇన్వెస్ట్ తెలంగాణలో రక్షణ ఎక్స్‌పో ప్రారంభించండి

కేంద్ర రోణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ వినతి

2లో

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

అమెరికా, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులు

## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు

కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

3లో

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు!

**దేశవ్యాప్తంగా ప్రముఖుల శుభాకాంక్షలు**

**రెండు తెలుగు రాష్ట్రాల్లో జనసైనికుల సేవా కార్యక్రమాలు**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:**
తెలుగు రాష్ట్రాల్లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేవలం జనసేన మాత్రమే కాదు కూటమి పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. మరోవైపు పవన్ కళ్యాణ్ కు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టారు.



**ప్రధాని విషెస్..**
జనసేనానికి ప్రధాని నరేంద్ర మోడీ బర్త్డే విషెస్ తెలిపారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది 'పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు. ఆయనకు ప్రజల్లో ఎంతో గౌరవం ఉందని..

- మిగతా 3వ పేజీలో




# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

**ఎటు చూసినా విధ్వంసం, వికృతం**

- జలద్రోహం చేస్తున్న జలగల పాలన
- అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో
- భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమీషన్లు
- వెయ్యిరోజుల్లో 4.50లక్షల కోట్ల అప్పులు
- రుణమాఫీ, పెన్షన్లు, ఉద్యోగాలు అన్నీ మోసపూరిత హామీలే
- కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనపై బిఆర్ఎస్ ఛార్జ్‌షీట్
- సిఎం రేవంత్ పాలనపై నిప్పులు కక్కిన కెటిఆర్




# వ్యూహమా? వ్యూహాత్మక తప్పిదమా?!

(మొదటి పేజీ తరువాయి)

వారిపై చర్యలు ఏవి.. తెలంగాణ కాంగ్రెస్ లో చాలామంది నేతలు కట్టు దాటారు. కానీ వారిపై చర్యల విషయంలో కాంగ్రెస్ నాయకత్వం వెనుకబడింది. ఒక తీన్మార్ మల్లన్న వదంతమే తీసుకుంటే.. బీసీ కులగనన నివేదికను పబ్లిక్ గా నిరసిస్తూ చించివేశారు. పార్టీ విధానాలపై బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. కానీ ఆయనపై తక్షణం చర్యలకు దిగలేదు కాంగ్రెస్. నోటీసులు జారీ చేసి సస్పెన్షన్ వేటు వేసే సమయానికి జరగాల్సిన రాజకీయ నష్టం జరిగిపోయింది. తీన్మార్ మల్లన్న శైలిని గమనిస్తే ఆయన ఉద్దేశపూర్వకంగానే సస్పెన్షన్ పొందేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారని.. అంతవరకు పార్టీ లోపల ఉంటూనే వ్యతిరేక స్వరాలు వినిపించారని అభిప్రాయం వ్యక్తం అయింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే పదేపదే నాయకత్వం పై విమర్శలు చేస్తూ వచ్చారు. క్రమశిక్షణ కమిటీ కేవలం నోటీసులతో సరిపెట్టింది.

**పెరుగుతున్న అసంతృప్త స్వరాలు..**

అయితే తప్పు చేసిన వారిపై వేటు వేయకుండా కాంగ్రెస్ చేస్తున్నది తప్పిదమా? వ్యూహాత్మక తప్పిదమా? అన్నది తెలియడం లేదు. అయితే కాంగ్రెస్ అధినాయకత్వం తీరుతోనే తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కారులో అసంతృప్తి స్వరాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రి లేదా కేబినెట్ సహచరులపై సొంత పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారు. కానీ హై కమాండ్ తక్షణ చర్యలకు దిగడం లేదు. దీంతో స్థానిక నాయకత్వానికి నాయకులు లెక్కచేయడం లేదు. మరి ఇన్ని జరిగాక కూడా హై కమాండ్ గుణపాఠాలు నేర్చుకోకపోతే మరిన్ని ఇబ్బందులు తప్పవు.

# ఏంటి 'సర్' ఈ ప్రక్రియ!



ముఖ్యంగా వివరాలు రాని ఓట్లకు సంబంధించి నోటీసులు పంపే ప్రక్రియలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. సమాచార లోపంతో ఇప్పటికీ చాలామందికి నోటీసులు అందడం లేదు. అలా నోటీసులు అందరి వారిలో అర్హత ఉన్నవారు సైతం ఓట్లు కోల్పోయే అవకాశం ఉంది.

**తీవ్ర గందరగోళం..**

తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తీవ్ర గందరగోళానికి కారణం అవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలవల్ల దాదాపు 90 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీచేశారు. కానీ ఆ నోటీసులు క్షేత్రస్థాయిలో ఆ ఓటర్లకు చేరలేదు. తమ ఓటు విషయంలో వివరణ ఇచ్చుకోవాల్సి ఉందని ఇప్పటివరకు వారికి తెలియదు. ఇప్పటివరకు కేవలం 30 లక్షల మందికి మాత్రమే నోటీసులు అందినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో బిఎల్వోల ద్వారా నేరుగా ఓటర్ల చేతికి అందింది కేవలం రెండు లక్షల మందికి మాత్రమే. అంటే మొత్తం లక్ష్యంలో కనీసం రెండు శాతం మందికి కూడా నోటీసులు అందలేదన్నమాట.

**గడువు పూర్తి..**

నోటీసులు జారీ అయిన తర్వాత వారు వివరణ ఇవ్వకపోతే ఖచ్చితంగా వారి ఓటు పోయినట్టే. దాదాపు 17 లక్షల మందికి సంబంధించి విజ్ఞప్తులు, సమాధానాలు ఇచ్చేందుకు ఇచ్చిన గడువు కూడా పూర్తయిపోయింది. క్షేత్ర స్థాయిలో సరైన సిబ్బంది లేకపోవడం, ఆన్లైన్ సర్వర్ల సాంకేతిక లోపాలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో సరైన సమన్వయం లోపించడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణాలు. నోటీసులు సరిగ్గా చేరకపోవడం వల్ల వేలాది మంది వాటర్లు తమకు తెలియకుండానే ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

## సర్వత్రా విమర్శలు..

సర్ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ఓటర్ల జాబితాను వేగంగా ప్రక్షాళన చేయాలన్న తొందర మంచిదే. కానీ శాస్త్రీయ విధానాలను విస్మరించి నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఈ అస్తవ్యస్త పరిస్థితి. డూప్లికేట్ ఓట్లు, చిరునామా మార్పులు, చనిపోయిన వారి వివరాల తొలగింపు పేరుతో చేపట్టిన ఈ ప్రక్రియలో సరైన కమ్యూనికేషన్ లేకపోవడంతో సామాన్య ప్రజలు ఈసీ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

# కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై వేటు!

**దాదాపు నిర్ణయం దిశగా..**

మంత్రి కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డి పై చర్యలకు దాదాపు కాంగ్రెస్ హై కమాండ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీతో పాటు కీలక నేతలపై బహిరంగ వ్యాఖ్యలు చేసినందుకు గాను వారిపై చర్యలకు ఉపక్రమించనున్నట్లు సమాచారం. వారిద్దరితో పదవులకు రాజీనామా చేయించాలని హైకమాండ్ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు అంతా ఢిల్లీలోనే ఉన్నారు. సీఎం రేవంత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కే సి వేణుగోపాల్ తో కీలక చర్చలు జరిపారు. నేతలు పదేపదే క్రమశిక్షణ తప్పుతున్నా.. చర్యలు తీసుకోకపోతే పార్టీలో ఇతరులు కూడా ఇదే బాట పడతారని తెలంగాణ ముఖ్య నేతలు హై కమాండ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

**సురేఖ చివరి ప్రయత్నం..**

మరోవైపు మంత్రి కొండా సురేఖ తన పదవిని కాపాడుకునేందుకు ఢిల్లీకి చేరుకొని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కేసి వేణుగోపాల్ తో సమావేశానికి అవకాశం లభించలేదని సమాచారం. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బలి చేయవద్దని.. అందులో తన తప్పేమీ లేదని ఆమె ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఇంకోవైపు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజ్యం మరోసారి స్థానిక నేతలు, ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరిపి తన తుది నివేదికను అధిష్టానానికి సమర్పించనున్నారు. ఈ సంప్రదింపుల అనంతరం పార్టీ అధికారిక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే అసంతృప్త నేతల వైఖరి వల్ల ప్రభుత్వానికి, పార్టీకి వస్తున్న నష్టాన్ని నివారించాలంటే కఠిన నిర్ణయాలు తప్పవనే భావనలు అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడం, చిన్నారెడ్డి స్థానంలో మరొకరికి ప్రణాళిక సంఘం బాధ్యతలు ఇవ్వడం ద్వారా పార్టీలో స్పష్టమైన క్రమశిక్షణ సంకేతాన్ని ఇవ్వాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## బిఆర్ఎస్ నిరసనలో మల్లారెడ్డి స్టెప్పులు



హైదరాబాద్:మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎక్కడుంటే అక్కడ హంగామా ఉంటుంది. కార్యక్రమం ఏదైనా తనదైన ఆట పాటలతో అందరిని హుషారెత్తిస్తుంటారు. మరోసారి తనదైన స్టెప్పులతో అందరిని అలరించారు. వివరాల్లోకి వెళ్తే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటితో వెయ్యి రోజులు పూర్తి చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాని, కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడిక్కడ నిరసనలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి నిరసన కార్యక్రమంలో పాల్గొని హంగామా చేశారు. యువకులతో కలిసి కాంగ్రెస్ మోసాలను ఎండగడుతూ యువత సమానంగా డ్యాన్సలు వేసి కార్యకర్తల్లో సరికొత్త జోష్ నింపారు. మళ్లీ బీఆర్ఎస్‌ని గెలువాల్సిన అవసరాన్ని ఊర మాస్ స్టెప్పులతో ప్రజలకు అర్థం చేయించారు.

# తిరుమలలో అవినీతి అధికారి!

(మొదటి పేజీ తరువాయి)

కలియుగ దైవం తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో మెండు లోకనాథం నివాసం తో పాటు ఆయనకు సంబంధించిన పలు ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడా పెట్టారనే పక్కా సమాచారంతో దాడులు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ బృందాలు.. తిరుపతిలోని పెద్ద కాపు లే అవుట్ లో ఉన్న లోకనాథం ప్రధాన నివాసం పై దాడి చేశారు. దీంతో భారీగా అక్రమ ఆస్తులు బయటపడినట్లు తెలుస్తోంది.

**ఏకకాలంలో ఐదు చోట్ల..**

ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో అధికారుల బృందం ఉదయం 6 గంటల నుంచి ఏకకాలంలో దాడులు చేసింది. మొత్తం ఐదు వేరువేరు ప్రాంతాల్లో తనిఖీలు ప్రారంభించారు. తిరుమలలో ఉన్న లోకనాథం కార్యాలయం తో పాటు తిరుపతిలోని ఆయన ఇద్దరు బావమరుదుల నివాసాలు, ఏర్పేడు మండలం చెల్లూరు లోని ఆయన సోదరుడు ఇంటిపై కూడా ఏసీబీ అధికారులు ఒకేసారి సోదాలు జరిపారు. తిరుమల క్షేత్రస్థాయిలో కీలక పదవిలో ఉంటూ అక్రమార్జనకు పాల్పడ్డారని ఏసీబీకి సమాచారం అందింది. అందుకే విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. కీలక ఆస్తుల పత్రాలు, నగదు, బ్యాంక్ లాకర్లు, బాండ్లు, వివిధ రంగాల్లో పెట్టిన అక్రమ పెట్టుబడులకు సంబంధించిన పత్రాలు కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**సరికొత్త సంచలనం..**

తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోనే ఒక అక్రమ అధికారి అవినీతి పర్వం వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమల పవిత్రతను కాపాడడంతో పాటు టీటీడీలో అవినీతిపై ఉక్కు పాదం మోపుతామని స్పష్టం చేసింది. గతంలో శ్రీవారి ఆలయ విధుల్లో ఉన్నప్పుడు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలపై లోతుగా విచారణ జరిపిన అధికారులు.. ఈ తాజా చర్యలకు దిగినట్లు తెలుస్తోంది.. ప్రస్తుతం విస్తృత తనిఖీలు కొనసాగుతుండగా.. లభ్యమైన మొత్తం ఆస్తుల విలువ, ల్యాండ్ డాక్యుమెంట్లు, డిపాజిట్ల వివరాలపై సాయంత్రానికి ఏసీబీ అధికారులు పూర్తి స్పష్టతతో కూడిన ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. అధికారుల తనిఖీల్లో పట్టుబడిన ఆస్తులు బహిరంగ మార్కెట్లో 100 కోట్లకు పైగా ఉంటాయన్నది ఒక ప్రచారం.

# బహుళ అంతస్తులపై 'ఫైర్'

తనిఖీలు చేయనున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వెనువెంటనే నోటీసులు జారీ చేసేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు సమాచారం.

**తరచూ అగ్ని ప్రమాదాలు..**

భాగ్యనగరంలో పలు బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలలో ఇటీవల వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణిస్తోంది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. అందుకే తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల విభాగం తో కలిసి కఠిన చర్యలకు ఉపక్రమించనుంది. నగరంలోని ప్రైవేట్, కమర్షియల్, రెసిడెన్షియల్ అపార్ట్మెంట్లలో అగ్నిమాపక రక్షణ నిబంధనలు సరిగ్గా అమలు జరుగుతున్నాయా? లేదా? అని తేల్చేందుకు విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు.

**తనిఖీలు ఇలా..**

భాగ్యనగరంలో త్వరలో ఆకస్మిక తనిఖీలు జరగనున్నాయి. ప్రధానంగా భవనాలకు సంబంధించిన ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల చెల్లుబాటును పరిశీలించనున్నారు. ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే స్పందించాల్సిన ఆటోమేటిక్ ఫైర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ హౌస్ రీల్స్, అత్యవసర పంపులు సరైన కండిషన్ లో పనిచేస్తున్నాయా? లేదా? అని క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయనున్నారు. నిబంధనలు పాటించిన వారికి అక్కడికక్కడే నోటీసులు జారీ చేయనున్నారు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ లకు సైతం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు.

**నిబంధనలకు తిలోదకాలు..**

నగరంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలో నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జాతీయ భవన నిర్మాణ నిబంధనల ప్రకారం ప్రతి కొన్ని అంతస్తుల మధ్య ఖాళీగా ఉంచాల్సిన స్థలాలను.. అనేక భవనాల్లో క్లబ్ హౌస్ లుగా, వినోద కేంద్రాలుగా, భారీ కార్యాలయాలుగా నిబంధనలకు విరుద్ధంగా మార్చేస్తున్నారు. ఇటువంటి అక్రమ భవనాలను గుర్తిస్తే వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి అగ్నిమాపక శాఖ అధికారులు సిద్ధపడుతున్నారు. అయితే ఈ ప్రక్రియ ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ):కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. బుధవారం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై హరీశ్ రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో షార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రొ మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్ అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. ఢిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఎంగిలి విస్తరాకుల దగ్గర కుక్కలు కొట్టుకున్నట్లు.. రాష్ట్ర సంపాదన కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారు. ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్వచించరు. జల ద్రోహం చేస్తున్న జలగల పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు చంచాగిరి చేస్తూ గురువుగారికి దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెప్పారు. వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారన్నారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్కు డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్ఏ నోరు తెరువదు. జీఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మోచేయి నీళ్లు తాగే అధికారి ఆదిత్య నాద్ దాస్ ను సలహాదా రుగా పెడితే తెలంగాణకు నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారు. రూ.50 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని రూ.20 కోట్లతో ముగించారని మండిపడ్డారు. నీళ్లు అడిగితే కోసి రక్తం చల్లమన్నారు. యూరియా అడిగిన రైతులపై లాఠీ చార్జి చేశారు. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష, మోటర్లుకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు బందు అయింది. రాహుల్ బంధ్ చాలయిందని ఎద్దేవా చేశారు.

# వెయ్యిరోజుల అభివృద్ధిపై చర్చకు రండి

## బిఆర్ఎస్‌కు మంత్రి అడ్లూరి సవాల్

హైదరాబాద్:కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు సంబంధించి బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌పై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి లిస్ట్‌ను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుకు వాట్సాప్‌లో పంపిస్తున్నట్లు చెప్పారు. ఛార్జ్‌షీట్ కాదు దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌లో అబద్దాలు మాత్రమే ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను హరీశ్ రావు, కేటీఆర్, కేసీఆర్‌కు రిపోర్ట్ పంపిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వెయ్యి రోజుల పాలనపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను అమలు చేస్తూనే కొత్త పథకాలు కూడా ఇస్తున్నామని చెప్పారు. 'మాకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. అప్పుడే కేటీఆర్‌కు తొందర ఎందుకు' అని ప్రశ్నించారు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

టెహ్రాన్: పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అమెరికా దాడులతో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఇరాక్, జోర్డాన్‌పై ఇరాన్ ప్రత్యేక సైనిక దళం ఐఆర్‌జీసీ దాడి చేసింది. కువైత్, బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్ ప్రాంతంలో అమెరికా దాడి వల్ల ఓ పెళ్లింట విషాదం సంభవించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందారని, 50 మంది గాయపడ్డారని తెలిపింది. ఈ ఉదంతంపై ఇరాన్ సుప్రీం లీడర్ మండిపడ్డారు. యూఎస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. యూఎస్‌కు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహబి పేర్కొన్నారు. ఈ దాడులు ఎందుకు చేశామా? అని చింతించేలా చేస్తామని హెచ్చరించారు. అయితే, హోర్ముజ్‌లో కమర్షియల్ నౌకలపై ఇరాన్ దాడి చేసే ప్రయత్నం చేయడంతోనే తాము దాడులు చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇక తమ భూభాగం వైపు వస్తున్న 13 బాలిస్టిక్ మిసైల్స్‌ను మార్గమధ్యంలోనే ధ్వంసం చేశామని జోర్డాన్ మిలిటరీ పేర్కొంది. మరో మూడు మిసైల్స్ నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయాయని తెలిపింది. ఇరాన్ దాడుల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పింది.

## జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

అమరావతి:రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

# కాంగ్రెస్‌లో నిస్తేజం!



**ఉత్సాహం కరువు..**

కాంగ్రెస్ పార్టీలో క్షేత్రస్థాయిలో ఉత్సాహం కరువైంది. ఒకవైపు పార్టీలో అంతర్గత కుమ్ములాటలు నిజమైన పార్టీ వాదులను తీవ్ర నిరాశలో ముంచేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పని చేసిన కార్యకర్తలకు కనీస గుర్తింపు లేదు. ఇన్ని రోజులు అవుతున్న కార్పొరేషన్ పదవులు, నామినేటెడ్ పోస్టులు, స్థానిక స్థాయి ప్రాతినిధ్యం ఆశించిన స్థాయిలో భర్తీ కాకపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరాశలో ఉన్నారు. కష్టపడి అధికారంలోకి తెచ్చిన తమకు దక్కిన గుర్తింపు ఏమీ లేదన్న భావన కేడర్లో బలంగా ఉంది. సీనియర్ మంత్రుల మధ్య అంతర్గత విభేదాలు, ఉమ్మడి జిల్లాల్లో వర్గ పోరు ఆ పార్టీ వాతావరణాన్ని మరింత నీరుగాచుతోంది.

**పట్టు కోల్పోతున్న రేవంత్..**

కాంగ్రెస్ పార్టీపై పట్టు కోల్పోతున్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఆయన ఎంతవరకు పాలన పైనే ఫుల్ ఫోకస్ పెట్టారు. మూసి పునరుదజ్జీవనం, హైడ్రా, పెట్టుబడుల సేకరణ, మౌలిక వసతుల కల్పన పై పూర్తి దృష్టి పెట్టారు తప్ప పార్టీపై పట్టు వదిలేసారు. ప్రతి పథకాన్ని ఒక పొలిటికల్ ఈవెంట్ గా మార్చడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వం చేస్తున్న పనులు కూడా ప్రజల్లోకి అనుకున్నంత బలంగా వెళ్లడం లేదని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**వెంటాడుతున్న ఆర్థిక లోటు..**

తెలంగాణ ప్రభుత్వం మునుపెన్నడు లేని ఆర్థిక లోటును ఎదుర్కొంటుంది. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నారు. కనీసం ఎమ్మెల్యేలు అడుగుతున్నా నిధులు సమకూర్చుకో లేకపోతున్నారు. అన్నింటికీ మించి నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ జరగడం లేదు. వీటన్నింటికీ కారణం రేవంత్ రెడ్డిని బలహీనపరిచే ప్రక్రియలో భాగంగా జరుగుతున్న పరిణామాలే. వాటికి హై కమాండ్ ఆజ్యం పోయడం కూడా కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోవడానికి కారణం అవుతోంది.

## ఇన్వెస్ట్ తెలంగాణలో రక్షణ ఎక్స్‌పో ప్రారంభించండి

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించ నున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ÷శ్వవ్యాప్తంగా రక్షణ రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశర చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు. రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేం దుకు సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కోరారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ శాఖ మొత్తం1,500 ఎకరాలు కోరిందని.. మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాలకు ఈ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు!

ఆంధ్ర ప్రదేశ్ లో ఎంబీఏ సుపరిపాలన అజెండాను ముందుండి నడిపిస్తున్నారు. సమాజ సేవలో ఆయన దీర్ఘాయుష్ తో జీవించాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ కు పవన్ కళ్యాణ్ రిప్లై ఇచ్చారు.' నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు, ఆశీర్వాదాలు అందించినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ ఆప్యాయత, ప్రోత్సాహంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు మరింత నిబద్ధతతో సేవ చేయాలని నా సంకల్పాన్ని బలపరిచింది. 140 మంది కోట్ల భారతీయుల కలలు, ఆకాంక్షలను మోస్తూ, సమైక్య భారత్ నిర్మాణం పట్ల మీకున్న నిబద్ధత దేశాన్ని స్ఫూర్తినిస్తుంది. మీ దార్శనిక నాయకత్వంలో, ఎన్డీఏ సమిష్టిబలంతో,, సుపరిపాలన, అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మేము దృఢ నిశ్చయంతో ముందుకు సాగుతున్నాము. ఆంధ్ర ప్రదేశ్, దేశ సేవలో నా బాధ్యతలను ముందుగా తీసుకెళ్ళేందుకు మీ ఆశీర్వాదం, మార్గదర్శకత్వాన్ని కోరుకుంటున్నాను ' అంటూ పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు.



**హోంమంత్రి అభినందనలు..**

మరోవైపు కేంద్ర హోం మంత్రి అమిత్ షా పవన్ కళ్యాణ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎన్డీఏ నిర్దేశించిన లక్ష్యాలను సాకారం చేసే దిశగా మీరు అంకితభావంతో చేస్తున్న కృషి అభినందనీయం. ప్రజలకు నిరంతరం సేవలందించేందుకు మీకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి అంటూ భగవంతుణ్ణి ప్రార్థించారు హోం మంత్రి అమిత్ షా.

**ముఖ్యమంత్రి చంద్రబాబు..**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పవన్ కళ్యాణ్ కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.' మిత్రులు, జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. పవర్ స్టార్ గా అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా ఉండే శ్రీ పవన్ కళ్యాణ్. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. పంచాయతీరాజ్ శాఖలో అనేక సంస్కరణలతో, అభివృద్ధి కార్యక్రమాలతో పెనుమార్పులు చేస్తున్నారు. గిరిజన ప్రజల కష్టాలు తీర్చేల రోడ్ల నిర్మాణం నుంచి పచ్చదనం పెంపు వరకు ఆయన తీసుకుంటున్న చర్యలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయి. మార్పును ఆవిష్కరిస్తున్నాయి. అందుకే ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆశీర్వదించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను' అంటూ ట్వీట్ చేశారు.

## చంద్రబాబు అపర భగీరథుడు

### ఏపీ సస్యశ్యామలం కాబోతోంది
### స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానం, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణతో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి కొనియాడారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రారంభించారని... పోలవరం కాలువను కూడా ప్రారంభించబోతున్నారని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాలతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందని, గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంతో ఏపీ సస్యశ్యామలం కాబోతోందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల క్యాలెండర్‌ను విడుదల చేసిందని, అందులో కేటాయించిన 36 ప్రాజెక్టుల్లో ఏకంగా 14 ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంతానికే చెందడం సీమ పట్ల చంద్రబాబుకు ఉన్న అంకితభావానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు కనీసం రూ.2,000 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కుప్పంకు నీళ్లిచ్చామని చెప్పి ట్యాంకర్లతో నీటిని తెచ్చి డ్రామాలు ఆడారని.. కానీ చంద్రబాబు మాత్రమే నిజంగా కుప్పంకు నీటిని తీసుకెళ్లారని గుర్తుచేశారు. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు గ్రీజ్ కూడా పూయలేని చేతకానితనంతో నాటి ప్రభుత్వం విపత్తును కొనితెచ్చిందని విమర్శించారు.

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

హైదరాబాద్: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్



అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## రేషన్ బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

### మరో 5 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం

హైదరాబాద్: తెలంగాణలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది.ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందిస్తున్న మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ గడువును మరో ఐదు రోజుల పాటుపొడిగించింది. దీంతో ఇప్పటివరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యం కోటాను తీసుకోలేకపోయిన అర్హులైన లబ్ధిదారులకు మరికొంత సమయం లభించింది. తాజా నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ కొనసాగనుంది. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ఆగస్ట్ 1వ తేదీన ప్రారంభమైంది. తొలుత ఆగస్ట్ 31వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయాలని అధికారులు షెడ్యూల్ రూపొందించారు. ఒకేసారి 3 నెలల కోటా పంపిణీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల రద్దీ పెరిగింది. దీంతో కొందరు కార్డుదారులు తమకు కేటాయించిన కోటాను నిర్ణీత సమయంలో తీసుకోలేకపోయారు.

## వెయ్యిరోజుల అభివృద్ధిపై చర్చకు రండి

### బీఆర్ఎస్‌కు మంత్రి అడ్లూరి సవాల్

హైదరాబాద్:కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు సంబంధించి బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌పై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి లిస్ట్‌ను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుకు వాట్సాప్‌లో పంపిస్తున్నట్లు చెప్పారు. ఛార్జ్‌షీట్ కాదు దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌లో అబద్ధాలు మాత్రమే ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను హరీశ్ రావు, కేటీఆర్, కేసీఆర్‌కు రిపోర్ట్ పంపిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వెయ్యి రోజుల పాలనపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను అమలు చేస్తూనే కొత్త పథకాలు కూడా ఇస్తున్నామని చెప్పారు. 'మాకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. అప్పుడే కేటీఆర్‌కు తొందర ఎందుకు' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ 2014-18 మ్యానిఫెస్టో, కాంగ్రెస్ 2023 మ్యానిఫెస్టోపై చర్చకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. 'మీ పదేళ్ల పాలన, మా రెండున్నరేళ్ల పాలనపై దమ్ముంటే చర్చకు రండి' అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ చేశారు.




# అనంతారంలో ఆయిల్‌ఫామ్ తోట ధ్వంసం.. రైతు కష్టానికి తీరని నష్టం!

### రాత్రివేళ తోటలో చెట్లు నరికివేత.. లక్షల్లో నష్టం?

### రైతు ఫిర్యాదుతో కేసు నమోదు.. ఘటనపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం

### బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

**గుండాల, (క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలో ఆయిల్‌ఫామ్ తోట ధ్వంసమైన ఘటన కలకలం రేపింది. ఎంతో శ్రమించి సాగు చేస్తున్న తోటలోని పామాయిల్ చెట్లు నరికివేతకు గురికావడంతో బాధిత రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకుని ఆయిల్‌ఫామ్ తోటను సాగు చేస్తున్నాడు. మొక్కల పెంపకం, సంరక్షణ కోసం భారీగా పెట్టుబడి పెట్టి ఎంతోకాలంగా కష్టపడుతున్నాడు. అయితే రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తోటలోకి ప్రవేశించి చెట్లను నరికివేసి ఉండవచ్చని రైతు అనుమానం వ్యక్తం చేశాడు. ఉదయం తోటకు వెళ్లిన సమయంలో కొన్ని చెట్లు ధ్వంసమైన స్థితిలో కనిపించడంతో రైతు పోలీసులను ఆశ్రయించాడు. ఘటన కారణంగా తనకు లక్షల రూపాయల మేర నష్టం



వాటిల్లి ఉండవచ్చని బాధిత రైతు పేర్కొన్నాడు.

**ఎవరి పని? దర్యాప్తులో తేలాల్సిందే!**

తోటను ఎవరు ధ్వంసం చేశారు? ఈ ఘటనకు కారణం ఏమిటి? వ్యక్తిగత కక్షలా.. ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటివరకు నిందితులు ఎవరనేది నిర్ధారణ కాలేదు. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. నిందితులు ఎవరైనా గుర్తించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని



స్థానిక రైతులు కోరుతున్నారు.

**నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలి**

ఆయిల్‌ఫామ్ తోట ధ్వంసంతో నష్టపోయిన రైతుకు అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి తగిన సహాయం అందించాలని కుటుంబ సభ్యులు, స్థానిక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతు కష్టానికి భద్రత కల్పించడంతో పాటు ఘటనకు బాధ్యులెవరనేది త్వరగా తేల్చాలని కోరుతున్నారు. వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.



# పెరుగుతున్న డెంగ్యూ కేసులు.. దోమల బెడదపై ప్రత్యేక దృష్టి

### సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ షేక్ ఆరిఫ్ మహమ్మద్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్--45 పరిధిలో డెంగ్యూ కేసులు కొనసాగుతున్న నేపథ్యంలో ఆల్కాపూర్ టౌన్‌షిప్, ఇబ్రహీంబాగ్ చెరువు పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న దోమల బెడదపై పలువురు నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఫిర్యాదులు అందించారు. నివాసితుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ది సిటిజన్స్ కౌన్సిల్ ఈ విషయాన్ని శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. కె.ఎస్. రవికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారుల ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్, యాంటీ-లార్వా మందుల పిచికారీతో పాటు పాందేన్‌వాగు నాలాలో నిల్వ ఉన్న నీటి ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టడంపై ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ షేక్ ఆరిఫ్ మహమ్మద్ అభినందనలు తెలిపారు. అయితే ఇబ్రహీంబాగ్ చెరువు పరిసర కాలనీలు, మణికొండ ప్రాంతాల్లో డెంగ్యూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో దోమల నియంత్రణ చర్యలను ఒక్కసారి నిర్వహించి నిలిపివేయకుండా తరచుగా, నిరంతరంగా చేపట్టాలని అధికారులను కౌన్సిల్ కోరింది. ప్రత్యేకంగా మణికొండ, నెక్నాంపూర్, ఇబ్రహీంబాగ్ చెరువు పరిసర ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించడంతో పాటు యాంటీ-లార్వా చర్యలు, నిల్వ నీటి తొలగింపు, పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు వ్యాధి వ్యాప్తి చెందిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందస్తు నివారణ చర్యలను నిరంతరం కొనసాగించడం అత్యంత అవసరమని సిటిజన్స్ కౌన్సిల్ పేర్కొంది.

# ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి

### సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేసుకోవాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 02: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్నందున అర్హత కలిగిన ప్రతి పౌరుడు ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. 2026 ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించామని తెలిపారు. జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకుని, తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 16లోగా సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వద్ద క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయాలని కోరారు. ఎస్ఐఆర్‌లో భాగంగా స్వీకరించిన క్లెయిమ్స్, అభ్యంతరాల వివరాలను ప్రజల సమాచారార్థం అందుబాటులో ఉంచుతామని, ఈ వివరాలను ఈఆర్ఓలు వారానికి ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేస్తారని తెలిపారు. ఈఆర్ఓ నిర్ణయంపై అసంతృప్తి ఉంటే మొదటి అప్పీల్‌గా జిల్లా మేజిస్ట్రేట్‌ను, రెండో అప్పీల్‌గా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ను ఆశ్రయించే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన చోట నిర్ణీత గడువులోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.

# అక్రమ వ్యర్థాల తరలింపుపై మున్సిపల్ అధికారుల కొరడా

### నార్సింగి సర్కిల్--45లో 4 ట్రాక్టర్లు, ఒక ట్రిప్పర్ పట్టివేత

### రూ.45 వేల జరిమానా





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్--45 పరిధిలో అక్రమంగా వ్యర్థాలను తరలిస్తూ, అనధికార ప్రదేశాల్లో డంపింగ్ చేస్తున్న వాహనాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు వట్టినాగులపల్లి ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా వ్యర్థాలను తరలిస్తున్న 4 ట్రాక్టర్లు, ఒక పెద్ద ట్రిప్పర్‌ను అధికారులు పట్టుకున్నారు. సంబంధిత వాహనదారులపై మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని మొత్తం రూ.45,000 జరిమానా విధించారు. అక్రమంగా వ్యర్థాలను తరలించడం, అనుమతి లేని ప్రదేశాల్లో చెత్తను డంపింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నార్సింగి సర్కిల్--45 డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో అక్రమ వ్యర్థాల తరలింపును అరికట్టేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏల సాధన లక్ష్యం..!

### 6న జరిగే ఉద్యోగుల సంకల్ప సభను జయప్రదం చేయాలి

### తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏలను సాధించడమే లక్ష్యంగా పని చేస్తామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ఉద్యోగుల పక్షాన ఉంటూ ఉద్యమాలను చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏల సాధన కోసం ఈనెల 6న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించనున్న ఉద్యోగుల సంకల్ప సభకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ తో పాటు జేఏసీలోని భాగస్వామ్య సంఘాలు, వాటి నాయకులు పాల్గొన్నారు. పెండింగ్ బిల్లులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్లను తక్షణమే క్లియర్ చేయాలని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి, రాజశేఖర్ కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ కరువు భత్యం వాయిదాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ తరహాలోని చెల్లింపుల కోసం ప్రభుత్వం ప్రతి నెల రూ.2వేల కోట్ల చొప్పున నిధులను విడుదల చేస్తూ బకాయిలను లేకుండా చూడాలన్నారు. అలాగే 2004కు ముందు నోటిఫికేషన్ వెలువడి, వివిధ కారణాల వల్ల ఆ తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు కూడా ఆంధ్రప్రదేశ్‌లో కల్పించినట్టుగా ఇక్కడ కూడా ఓపీఎస్ ప్రయోజనం కల్పించాలన్నారు. అర్హత, అవకాశం ఉన్న ఏ ఒక ఉద్యోగి నష్ట పోకుండా న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వం తక్షణమే జీవో ఎంఎస్ 25ను సవరించాలన్నారు. గతంలోనూ ప్రభుత్వం అన్ని రకాల సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. జీవో 317 వల్ల స్థానికత కోల్పోయి నష్టపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను సరిదిద్దడంతో పాటు పదోన్నతులు, సాధారణ బదిలీలను వేగవంతం చేయాలన్నారు. అన్ని శాఖల్లో ఆలస్యమవుతున్న పదోన్నతుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులను కల్పించాలని కోరారు. అలాగే ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పార్ట్-టైమ్ ఉద్యోగుల సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలన్నారు. టైపిస్ట్-కంప్యూటర్ ఆపరేటర్లను తొలగించకుండా చూడాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్స్ సడలింపులు, పని ప్రదేశాల్లో కనీస ప్రాథమిక వసతులను కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

**మూడు రోజుల పాటు సన్నాహక సమావేశాలు..**

6న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరగబోయే ఉద్యోగుల సంకల్ప సభను విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయి వరకు ప్రచారం చేస్తున్నట్టుగా ఈ సందర్భంగా లచ్చిరెడ్డి, రాజశేఖర్ తెలిపారు. ఈనెల 2,3,4 తేదీలలో మండల స్థాయిలో సన్నాహక సమావేశాలను నిర్వహించనున్నట్టుగా చెప్పారు. పెద్ద సంఖ్యలో సంకల్ప సభకు ఉద్యోగులు తరలి రానున్నట్టుగా తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. రాములు, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) అధ్యక్షులు బాణాల రాంరెడ్డి, జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దర్శన్ గౌడ్, ఎస్‌జీటీయూ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరికల వెంకటేశం, జీపీఓఏ అధ్యక్షులు గరిక ఉపేందర్ రావు, ఇంటర్మీడియట్ బోర్డు అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. భిక్షం, ఎస్‌జీటీయూ ప్రధాన కార్యదర్శి అరికల వెంకటేశం,డీఈడబ్ల్యూఏ అధ్యక్షులు హబీబ్ మియాతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు రాబర్ట్ బ్రూస్, రామరాజు, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# నోటీసులందుకున్న ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలి

### తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి

### రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ, హైదర్షా కోట్, శివరాంపల్లి ఓటరు కేంద్రాల ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఓటర్లకు ఇచ్చిన నోటీసులకు సరైన పత్రాలు తీసుకుని వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ, హైదర్షా కోట్, శివరాంపల్లిలో ఏర్పాటుచేసిన ఓటరు జాబితా నమోదు బస్తీ సభలను బుధవారం పరిశీలించి జరుగుతున్న పనితీరును అడిగి తెలుసుకున్నారు. మ్యాపింగ్ కానీ ఓటర్లతో పాటు తప్పులు ఉన్న ఓటర్లకు నోటీసులు అందుతున్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఏ ఏ ధ్రువ పత్రాలను సమర్పిస్తున్నారో ...అవి సరైనవా? కావా. అని చూసుకొని జాగ్రత్తగా పరిశీలించి జాబితాలో పేరు నమోదు చేయడానికి సర్టిఫై చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఓటర్ల తో మాట్లాడారు . ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభ్యంతరాలు ఉన్న ప్రతి ఓటర్ కు నోటీసులు అందజేసి సరైన ధృవ పత్రాలను తీసుకోవాలన్నారు. బస్తీ సభలలో అధికారులు ఓటర్లతో హియరింగ్ చేస్తున్న విధానాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎన్నికల అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రనగర్ ఏఈఆర్ఓ బి.సురేందర్ రెడ్డి లు పాల్గొన్నారు.

# దాడులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా...?

### బీజేపీ నేతలపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

### బీజేపీ పట్టణ అధ్యక్షులు కొంతం నాగిరెడ్డి



**క్రైమ్ మిర్రర్ ,నేరేడుచర్ల :** ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉందని, అయితే నిరసన తెలిపినందుకు ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై దాడులు చేయడం, పార్టీ కార్యాలయాలపై దౌర్జన్యానికి పాల్పడటం కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగదని బీజేపీ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు కొంతం నాగిరెడ్డి అన్నారు.నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట బీజేపీ నేతలు నిరసన వ్యక్తం చేసినందుకు, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడటం అత్యంత హేయమైన, పిరికిపంద చర్య అని విమర్శించారు.అదే విందంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు ని అప్రజాస్వామికంగా అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. నల్గొండ లో కాంగ్రెస్ గుండాలు దాడి సమయంలో నాగం వర్షిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను దూషించడంతో పాటు, ఆయన తల్లిదండ్రులు, మేనమామపై దాడి చేసి, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారని ఆరోపించారు. అదేవిధంగా బీజేపీ కార్యాలయంపైకి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చి దౌర్జన్యంగా వ్యవహరించడం, గుడ్లు విసరడం వంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ప్రజాస్వామ్యంలో ఒక పార్టీకి మరో పార్టీపై విమర్శలు చేసే, నిరసన తెలిపే హక్కు ఉంటుందని, అంతేగానీ ప్రత్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడటం కొత్త రాజకీయ సంస్కృతికి దారితీస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని విమర్శించారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలకు పాలన అందించాల్సిన బాధ్యత కలిగిన వ్యక్తి అని, గుండాలను ప్రోత్సహించి ప్రత్యర్థులపై దాడులు చేయించడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజలు తగిన సమయంలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీజేపీ కార్యకర్తలు భయభ్రాంతులకు గురై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, దేశ భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ కార్యకర్తలు నిరంతరం పోరాడుతారని, బీజేపీ కార్యాలయాలు, నాయకులు, కార్యకర్తలపై దాడులను సహించేది లేదని స్పష్టం చేశారు.మరొక్కసారి ఇలాంటి సంఘటనలకు పాల్పడితే ఊరకునేది లేదని వారికి తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుంది అని అన్నారు.కాంగ్రెస్ పార్టీకి, బీజేపీ కార్యకర్తలకు మధ్య జరిగిన ఘర్షణల్లో దౌర్జన్యానికి పాల్పడిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

## ఇటిక్యాల ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్

**మంచిర్యాల సెప్టెంబర్ 2 (క్రైమ్ మిర్రర్):** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. బుధవారం వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇటిక్యాల ఉపకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపకేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాల అమలును పరిశీలించారు. గర్భిణులు, చిన్నారుల వ్యాక్సినేషన్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, వ్యాక్సినేషన్‌కు ముందు లబ్ధిదారుల వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. వ్యాక్సినేషన్ వివరాలను యూవిన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను వందశాతం పూర్తి



చేయాలని ఆదేశించారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి పరీక్షలు నిర్వహించడం, మందులు అందించడం, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 14 ఏళ్లు నిండిన బాలికలందరికీ హెచ్‌పీవీ టీకా ఇప్పించి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఉపకేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండి సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో వైద్యాధికారి డాక్టర్ సమతతో పాటు వైద్య, నర్సింగ్, ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ల్యాబ్, మందుల నిల్వ గది, ఓపీ, ఇన్‌పేషెంట్ గదులను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడాన్ని అభినందించారు. ప్రజారోగ్య సేవల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ, మున్సిపల్, ఐసీడీఎస్, విద్యాశాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో శ్రీ నామదేవ్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## రక్తదాన కార్యక్రమం కు కోదండరాం కు ఆహ్వానం....

క్రైమ్ మిర్రర్ చందానగర్: హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా కొనసాగుతున్న రక్తదాన కార్యక్రమం కు ఎంఎల్ సి కోదండరాం ను హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ఆహ్వానించారు. రక్తదాన కార్యక్రమం ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడిన వారం అవుతానే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 12 వ తేదిన తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్త దాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోదండరామ్ కి కొండ విజయ్ కుమార్ తెలియచేశారు. రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని రక్తదాన దాతలు పెద్ద ఎత్తున హాజరై రక్తదానం అందచేయాలని కోదండ రామ్ పిలుపునిచ్చారు.



## వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. కల్వకుర్తి బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్ఆర్ అందించిన ప్రజా సంక్షేమ పథకాలు, పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల్ల రాములు, సీనియర్ నాయకులు మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు కొల్లోజు రాజేష్ కుమార్, పసుల రమాకాంత్ రెడ్డి, కుడుముల చంద్రకాంత్ రెడ్డి, నాయకులు బాలు నాయక్, దామోదర్ రెడ్డి, బంగారి, సోఫి, రేష్మ, ముత్యాలు, జహంగీర్, భాస్కర్, ముక్తార్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో అక్టోబర్ 07న దళిత జర్నలిస్టుల ఫోరం మహాసభలు



విజయవంతం చెయ్యాలని కాషాపోగు జాన్ పిలుపు

దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం

దళిత జర్నలిస్టుల ఫోరం సంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా రామని అశోక్ ప్రధాన కార్యదర్శిగా నవీన్ ఎన్నిక





సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 02: జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాషాపోగు జాన్ అన్నారు. దళిత జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, కౌంటర్ కేసులతో వేధింపులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా దళిత జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాషాపోగు జాన్, రాష్ట్ర అధ్యక్షుల్లో యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా రామని అశోక్, ప్రధాన కార్యదర్శిగా నవీన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దశరథ్, రాజేందర్, తలారి నర్సింలు, సంజీవ్, మోహన్; కార్యదర్శులుగా ముక్కగల్ల యాదన్న, కందుకూరి క్రిష్ణ, రాహుల్ కుమార్, రాజు, గౌతమ్; కోశాధికారిగా సంపత్‌ను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వరిగుంతం శంకర్, దాసు, దానమ్మొల్ల క్రిష్ణ, బమైనగళ్ల బుచ్చయ్య, సలహాదారులుగా ఎం. కిషన్ రావు, రాజు, కార్యవర్గ సభ్యులుగా మాణిక్యం, పోచయ్య, పరమేసుల క్రిష, రాములు నియమితులయ్యారు. మనూర్ మండలం అతిమెల్ పాఠశాలలో దళిత జర్నలిస్టు రాములుపై జరిగిన దాడిని నాయకులు ఖండించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, దాడికి గురైన జర్నలిస్టులపై కౌంటర్ కేసులతో వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దళిత జర్నలిస్టులకు అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం, ఇళ్ల స్థలాలు, ఉచిత బస్సు పాస్‌లు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. నూతన జిల్లా అధ్యక్షుడు రామని అశోక్ మాట్లాడుతూ.. జిల్లాలోని దళిత జర్నలిస్టులను సమన్వయం చేసుకుని వారి హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తామని తెలిపారు. అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేపడతామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ.. దళిత జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, జర్నలిస్టులపై దాడులు, వేధింపులు, కౌంటర్ కేసులకు అడ్డుకట్ట పడే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాపాక విజయరాజు, సీనియర్ జర్నలిస్టులు విలాస్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హామీల విఫలంపై బిఆర్ఎస్ నేతల నిరసన



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో బాలాపూర్ మండలంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలాపూర్ చౌరస్తాలోని విశాల్ మార్ట్ సమీపం నుంచి బాలాపూర్ మండల కార్యాలయం వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా సరిగ్గా నెరవేర్చలేదని, హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు నేడు అష్టకష్టాలు పడుతున్నారని, ప్రజల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి ఓట్లు దండుకోవడం మాత్రమే కాకుండా, ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యతఅని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు మా ఉద్యమ పోరాటం ఆగదని, ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.


## హైదరాబాద్ లో అంకురా--న్యూ హొరైజన్స్ బాలల అభివృద్ధి కేంద్రాలు......

కేంద్రాలను ప్రారంభించిన ప్రముఖులు అల్లు స్నేహా రెడ్డి.....



**గచ్చిబౌలి క్రైమ్ మిర్రర్:** చిన్నారులకు సమగ్ర అభివృద్ధి సేవలు అందించేందుకు అంకురా హాస్పిటల్స్ ఫర్ ఉమెన్ & చిల్డ్రన్, న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ యూనిట్లలో ఏర్పాటు చేసిన నూతన బాలల అభివృద్ధి కేంద్రాలను ప్రముఖులు అల్లు స్నేహ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంకురా హాస్పిటల్స్ ఎండీ డా. కృష్ణ ప్రసాద్ రావు వున్నం, న్యూ హొరైజన్స్ వ్యవస్థాపకులు డా. సమీర్ దల్వాయి పాల్గొన్నారు. 2003లో ముంబైలో ప్రారంభమైన న్యూ హొరైజన్స్ సంస్థ ఆటిజం, ఏ డీ ఎచ్ డీ , సెరెబ్రల్ పాల్సీ, డౌన్ సిండ్రోమ్ తదితర అభివృద్ధి సంబంధిత సమస్యలు ఉన్న చిన్నారులకు ప్రత్యేక సేవలు అందిస్తోంది. ఈ భాగస్వామ్యంతో డెవలప్‌మెంటల్ పీడియాట్రిషియన్లు, స్పీచ్ థెరపిస్టులు, సైకాలజిస్టులు, ఫిజియోథెరపిస్టుల సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి రానున్నాయి. చిన్నారుల శారీరక, మానసిక, భావోద్వేగ అభివృద్ధికి అవసరమైన సేవలను ఒకే చోట అందించడమే కేంద్రాల ప్రధాన లక్ష్యమని ఈ కేంద్రాలు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని నిర్వాహకులు తెలిపారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్నవారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


## పేదల మనిషి వైయస్సార్

### జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు



**కోదాడ సెప్టెంబర్ 02( క్రైమ్ మిర్రర్ ):** 11వ వార్డులో వార్డు కౌన్సిలర్ మరియు కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ దేవపల్లి మల్లీశ్వరి నాగిరెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ 17వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు లు పాల్గొని వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ మహా జననేత అని, ప్రతి పేద ఇంటి గడపలో వైయస్సార్ ఉంటాడని ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, రెండు రూపాయల కిలో బియ్యం, ఇలా అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినా చిరస్మరణీయుడు వైయస్సార్ అని కొనియాడారు,. ఈ కార్యక్రమంలో కొమరబండ మత్స్య సహకార సంఘ చైర్మన్ దేవపంగు వెంకటి, కాంగ్రెస్ నాయకులు కోసూరి బద్రి గౌడ్, కర్లపూడి బాలకృష్ణ, తమలపాకుల లక్ష్మీనారాయణ, రామకృష్ణ, దేవపంగ వెంకటి, బచ్చలకూరి వెంకటేశ్వర్లు, దాసరి నరసయ్య, బాలస్వామి, డాక్టర్ శ్రీను, శంకర్, శ్రీకాంత్, చార్లీ, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption


# ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే లక్ష్యం



**క్రైమ్ మిర్రర్,మంగపేట:** అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన నూతన రేషన్ కార్డులను మంత్రి అనసూయ సీతక్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల పరిధిలో 2,257 నూతన రేషన్ కార్డుల ద్వారా 6,214 మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కొత్తగా వివాహమైన వారితోపాటు అర్హులైన కుటుంబాలకు ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. కుటుంబంలోని అర్హులైన సభ్యులందరికీ సన్నబియ్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మహిళల పేరుతో రేషన్ కార్డులు జారీ చేస్తూ కుటుంబంలో వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. స్థానికంగా కుట్టు శిక్షణ పొందిన 70 మంది మహిళలకు త్వరలో ధ్రువపత్రాలతోపాటు కుట్టు యంత్రాలు అందించే బాధ్యత తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఏకరూప దుస్తులు కుట్టే పనులను శిక్షణ పొందిన మహిళలకు అప్పగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా సంఘాలకు మంజూరైన భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ములుగులో నిర్మించిన ఇందిర మహిళా శక్తి భవనాన్ని సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవాలన్నారు. వ్యాపార నిర్వహణపై అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని, గ్రామాల అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్,, తహసీల్దార్ తోట రవీందర్,రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, ఆత్మ డైరెక్టర్ గాదె శ్రావణ్, భద్రాచలం రామాలయం బోర్డు సభ్యుడు పూజారి సురేందర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, మాజీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, నాయకులు అయ్యోరి యానయ్య, వల్లెపల్లి శివప్రసాద్, టి.వి. హిదయతుల్లా, పాయం అనిత, బాడిశ ఆదినారాయణ, మురుకుట్ల నరేందర్, బి. నాగార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 108 అంబులెన్స్‌లో గర్భిణీ కి ప్రసవం

### సమయస్ఫూర్తితో తల్లి, బిడ్డను కాపాడిన 108 సిబ్బంది

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కాన్పు కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఆమనగల్‌కు చెందిన యాదమ్మను వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కోటి ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. దీంతో ఆమెను కల్వకుర్తి 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవ నొప్పులు అధికమయ్యాయి. పరిస్థితిని గమనించిన 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వరప్రసాద్, పైలెట్ అశోక్ సమయస్ఫూర్తితో స్పందించారు. అంబులెన్స్‌లోనే ప్రసవానికి అవసరమైన చర్యలు చేపట్టి యాదమ్మకు సురక్షితంగా ప్రసవం చేయించారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, బిడ్డను సురక్షితంగా హైదరాబాద్‌లోని కోటి మెటర్నిటీ ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో అడ్మిట్ చేశారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లి, బిడ్డను సురక్షితంగా ఆసుపత్రికి చేర్చిన 108 సిబ్బంది వరప్రసాద్, అశోక్‌లను కుటుంబ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## పోచమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల చేయూత

### బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలో బుధవారం నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్ నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేశారు. ఆలయాల్లో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు సహకారం అందించడం బాధ్యతగా భావిస్తున్నానని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. రేకుల షెడ్ నిర్మాణంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కలుగుతుందని, ఆలయాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ఈధమ్మ మాంధాత బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల సహాయం అందించిన రాఘవేందర్ రెడ్డి సేవాభావాన్ని ఆలయ నిర్వాహకులు, భక్తులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన బీఆర్ఎస్ నేత జక్కుల కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు

### తన వద్ద డబ్బులు తీసుకొని మొఖం చాటేస్తున్నాడని పేర్కొన్న బాధితురాలు

### హైదరాబాద్ విడిచి వెళ్లాలని బెదిరించారు బాధితురాలు

**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** పెళ్లయిన విషయాన్ని దాచిపెట్టి తనతో సన్నిహితంగా ఉంటూ వ్యాపారంలో భాగస్వామ్యం కోసం తన వద్ద నుండి సుమారు రూ.30 లక్షలు తీసుకోని తన పై దాడి చేసినట్లు బి ఆర్ఎస్ నేత జక్కుల కిరణ్ ముదిరాజ్ పై నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఫిర్యాదు చేశారు. నేరేడ్మెట్ పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్మెట్ నివాసి అయిన జక్కుల కిరణ్ ముదిరాజ్ తనకు ఇదివరకే వివాహం అయినా కూడా మరొక మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి తనతో శారీరక సంబంధం ఏర్పరచుకొని, తన వద్ద కొంత మొత్తం డబ్బులు తీసుకొని ముఖం చాటు వేస్తున్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలని వదిలేసి వెళ్ళిపోమని జక్కుల కిరణ్ ముదిరాజ్ మరియు అతని భార్య, అతని సోదరి కలిసి ఆమెను శారీరకంగా హింసిస్తూ కులం పేరుతో దూషించినారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు నేరేడ్మెట్ పిఎస్ నందు జక్కుల కిరణ్ ముదిరాజ్, అతని భార్య మరియు అతని సోదరి పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నేరేడుమేట్ పోలీసులు తెలిపారు.

## నకిలీ కరెన్సీ చలామణిదారుల అరెస్ట్

### 2,91,100 రూపాయల నకిలీ నోట్లు, ఇతర సామాగ్రి స్వాధీనం



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** కమిషనర్ టాస్క్ ఫోర్స్, షంషాబాద్ జోన్ టీం, హైదరాబాద్, బాలాపూర్ పోలీసులతో కలిసి హైదరాబాద్ లో నకిలీ భారతీయ కరెన్సీ నోట్ల ముద్రణ మరియు చలామణీలో పాల్గొన్న ముగ్గురు నిందితులను పట్టుకొని వారి నుండి రెండు లక్షల తొంభై ఒక వేయి వంద రూపాయలు నకిలీ కరెన్సీ నోట్లు, నకిలీ కరెన్సీ తయారీకి ఉపయోగించే ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతల్ తండా, వడ్డిపట్ల కు చెందిన రామావత్ రాము అలియాస్ మహమ్మద్, తండ్రి రామావత్ బిచ్యా, 36 ఏళ్లు, వృత్తి జొమాటో డెలివరీ, రామావత్ మోతీలాల్ తండ్రి రామావత్ నందా నాయక్, 35 ఏళ్లు, వృత్తి ర్యాపిడో డ్రైవర్, రామావత్ గాంధీ తండ్రి రామావత్ రమేష్,19 ఏళ్లు, వృత్తి ఆటో డ్రైవర్, నాగోల్, బండ్లగూడ కు చెందిన సుధీర్ జాన్ చెలా అలియాస్ వంశీ, (పరారీలో ఉన్నాడు). ఈ కేసులో ప్రధాన నిందితుడు రామావత్ రాము కుటుంబ జీవితంలో గొడవల కారణంగా అతని భార్య అతన్ని విడిచిపెట్టడం, జీవనోపాధి ఖర్చులకు అక్రమ మార్గాల ద్వారా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో అతను తన బంధువు రామావత్ మోతీలాల్ తో యూట్యూబ్ మరియు ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు చూసి నకిలీ భారతీయ కరెన్సీ నోట్లను తయారు చేసే మరియు చలామణీ చేసే విధానాన్ని నేర్చుకున్నారు. విచారణలో, రామావత్ మోతీలాల్ యూట్యూబ్ లో బ్రౌజ్ చేస్తుండగా, నకిలీ కరెన్సీ నోట్ల తయారీకి సంబంధించిన నోటిఫికేషన్ వచ్చిందని, దానిలో స్క్రీన్ పై ఒక ఫోన్ నంబర్ కనిపించిందని ఆ తర్వాత అతను ఆ ఫోన్ నంబర్ ద్వారా ఆ వ్యక్తిని సంప్రదించి నకిలీ కరెన్సీ నోట్లను తయారు చేసే ప్రక్రియ గురించి అడిగాడు. నకిలీ కరెన్సీ నోట్లను తయారు చేయడానికి ఎప్సన్ కలర్ ప్రింటర్, స్కానర్, బాండ్ పేపర్లు మరియు ఇతర సామాగ్రిని కొనుగోలు చేయాలని ఆ వ్యక్తి తెలిపాడు. ఆ తర్వాత వారంతా కలిసి ప్రింటర్ ను కొనుగోలు చేసి నకిలీ భారతీయ కరెన్సీ నోట్ల ముద్రణకు అవసరమైన సామాగ్రిని సేకరించారు. వారు నకిలీ భారతీయ కరెన్సీ నోట్లను తయారు చేసి, రాత్రి సమయంలో వైన్ షాపులు మరియు కూరగాయల మార్కెట్లలో రామావత్ రాము తన మేనల్లుడు రామావత్ గాంధీ ద్వారా మార్కెట్ లో చలామణీ చేయడానికి ప్రయత్నించారని, నమ్మదగిన సమాచారం ఆధారంగా, కమిషనర్ టాస్క్ ఫోర్స్, షంషాబాద్ జోన్ టీం, హైదరాబాద్, బాలాపూర్ పోలీసులతో కలిసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, రూ. 2,91,100 విలువైన నకిలీ భారతీయ కరెన్సీ నోట్లను, ప్రింటింగ్ పరికరాలు మరియు నకిలీ కరెన్సీ తయారీకి ఉపయోగించే ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మరియు స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ కోసం బాలాపూర్ పీఎస్ ఇన్స్పెక్టర్ కి అప్పగించారు.

## మహానేత వైఎస్సార్ వర్ధంతి 17వ వర్ధంతి వేడుకలు



**సంస్థాన్ నారాయణపురం, క్రైమ్ మిర్రర్:-** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు నారాయణపురం గ్రామ శాఖ అధ్యక్షులు బద్దుల మురళి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి చేసిన సేవలను, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను స్మరించుకున్నారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, రైతు సంక్షేమం తదితర రంగాల్లో ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రజలపై చెరగని ముద్ర వేశాయని తెలిపారు. ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మందు గుల బాలకృష్ణ కత్తుల లక్ష్మయ్య మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నర్సింహ, ఏపూరి సతీష్, కుక్కల నరసింహ, బీసీ సెల్ మండల అధ్యక్షులు రత్తపల్లి యాదయ్య, చేనేత సహకార సంఘం అధ్యక్షులు చిలుకూరి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెగావత్ రెడ్యా నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ రాచకొండ రమేష్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ నాయకులు ఉప్పల నాగరాజు, కొండ నవీన్ గౌడ్ , బానోత్ కిరణ్ నాయక్, ఒకటవ వార్డు మెంబర్ బలుగూరి శివకుమార్ , రేవనపల్లి గోపాలు, గునిగంటి రాజు గౌడ్ ,ఏపూరి గోపాల్, ఎండి అబ్బు బద్దుల యాదగిరి, వేము గాలయ్య వలిగొండ మాధవులు, సింగం కృష్ణ ,ఎర్రోళ్ల కంచయ్య, చిలువేరు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేసిన సేవలను కొనియాడారు ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా మండల గ్రామ స్థాయి నాయకులు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నల్గొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామంలో చిట్యాల మండల జనసేన నాయకులు నాగార్జున ప్రవీణ్ కుమార్ చారి ఆధ్వర్యంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్చి, భారీ కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ కేవలం సినిమా హీరో మాత్రమే కాదని, పేదల, రైతుల, యువత కోసం నిలబడే నిజమైన నాయకుడని అన్నారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణలో కూడా జనసేనను బలోపేతం చేస్తామని, అవినీతి రహిత సమాజం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాపోలు గణేష్, ఐత రాజు స్వామి, మురళి జనసేన కార్యకర్తల పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## పోరాటమే లక్ష్యంగా.. హత్నూర జర్నలిస్టులకు డిజెఎఫ్ కీలక పదవులులి



**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 02:** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్న హత్నూరకు చెందిన నలుగురు జర్నలిస్టులకు దళిత జర్నలిస్టు ఫోరంలో కీలక బాధ్యతలు లభించాయి. ముక్కగల్ల యాదన్నను జిల్లా కార్యదర్శిగా, ఎం. కిషన్‌రావును సలహాదారుగా, వరిగుంతం శంకర్‌ను ఆర్గనైజింగ్ సెక్రటరీగా, పరమేషుల క్రిష్ణను కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా దళిత జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాషాపోగు జాన్, రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి సమక్షంలో నూతన బాధ్యతలు పొందిన జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాశపోగు జాన్, తలారి యాదగిరి, జిల్లా అధ్యక్షుడు రామని అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతామని పేర్కొన్నారు.

**భర్త:** గొల్లగూడెం లక్ష్మారెడ్డి.
**కుమారుడు:**
గొల్లగూడెం యాదిరెడ్డి–పావని
**మనుమడు:-** సహస్రిత్ రెడ్డి,
**మనమరాండ్లు:-** హరిస్మిత, మనస్విని.
కీర్తిశేషులు గొల్లగూడెం జంగారెడ్డి – చంద్రకళ
మనుమలు – మనుమరాండ్లు.
గొల్లగూడెం హరీష్ రెడ్డి – స్వాతి
మనుమలు – మనుమరాండ్లు.
**కూతుర్లు:**
**వినోద - కీర్తిశేషులు:** కృష్ణారెడ్డి
అమృత – హనుమంత్ రెడ్డి



## రేవంత్ సర్కార్ పై బిఆర్ఎస్ బగ్గుమంటూ

# కోదాడలో భారీ నిరసన ధర్నా

### కాంగ్రెస్ వైఫల్యాలు ఎండగడుతూ కోదాడ గడ్డపై గర్జించిన మాజీ ఎమ్మెల్యే

### సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు

### బిమాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్




**కోదాడ సెప్టెంబర్ ( క్రైమ్ మిర్రర్):** ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాక్షేత్రంలో పోరాటం ఉధృతం చేస్తామని కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పిలుపు మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను గాలికొదిలేసిన తీరును ఎండగడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైన తీరును ప్రజలకు తెలియజేసేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు కోదాడ నియోజకవర్గ స్థాయి ధర్నా కార్యక్రమం మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గ కేంద్రమైన కోదాడ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ ఇచ్చిన అపరిష్కృత హామీలతో కూడిన " బాకీ కార్డుల "ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలోకి రావడం కోసమే కాంగ్రెస్ పార్టీ నకిలీ గ్యారెంటీ కార్డులు ఇచ్చి, వాటిని ఇంట్లో బీరువాల్లో భద్రంగా దాచుకోమని ప్రచారం చేసిందని మండిపడ్డారు. నేడు ఆ కార్డులు తుప్పుపట్టి, చెదలు పట్టిపోతున్నాయే తప్ప అందులోని హామీలు అమలయ్యే దాఖలాలు లేవని, వాటి గురించి ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టిన పనులకు సంబంధించిన కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల్లో తీవ్రమైన అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. 20 శాతం కమీషన్లు ముట్టజెబితే తప్ప బిల్లులు విడుదల చేయని దుస్థితి నెలకొనడంతో కాంట్రాక్టర్లు రోడ్లెక్కి ఆందోళనలు చేసే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నదాతలను నిలువునా మోసం చేస్తూ వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. మరోవైపు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాజధాని హైదరాబాద్‌లో భూకబ్జాలు, అవినీతి దందాలు చేస్తూ రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేశారని మండిపడ్డారు. అబద్ధపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ వెంటనే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు ఏడు రోజుల పాటు నియోజకవర్గంలోని గ్రామగ్రామాన నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రజా సమస్యలపై గులాబీ జెండా నిరంతరం పోరాడుతుందని తేల్చిచెప్పారు.



## ప్రారంభించి వారం రోజులు కాలేదు..
## తహసీల్దార్ ఆఫీసులో టైల్స్ బీటలు!

**క్రైమ్ మిర్రర్ , సెప్టెంబర్ 2:** కమాన్‌పూర్ మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.75 లక్షల నిధులు కేటాయించింది. ఇటీవల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించారు. అయితే ప్రారంభించిన ఎనిమిది రోజులకే కార్యాలయ ప్రాంగణంలోని కొన్ని టైల్స్ కుంగిపోవడం, పగిలిపోవడం నిర్మాణ నాణ్యతపై చర్చకు దారితీసింది. ప్రజాధనంతో నిర్మించిన భవనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించారా? టైల్స్ కింద ఏర్పాటు చేసిన బేస్ పనుల్లో నాణ్యత లోపించిందా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. టైల్స్ కింద కంకర, ఇసుక, సిమెంట్ మిశ్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా వినియోగించాల్సి ఉండగా, కంకరతో పాటు డస్ట్ వినియోగించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా కాదా అన్నది సంబంధిత అధికారులు సాంకేతికంగా పరిశీలించి తేల్చాల్సి ఉంది. ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే టైల్స్ కుంగిపోవడంతో రూ.75 లక్షలతో నిర్మించిన భవనంలో ఇంకా ఎలాంటి నిర్మాణ లోపాలు ఉన్నాయోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం నిత్యం అధికారులు, సిబ్బంది, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే నేపథ్యంలో నిర్మాణ నాణ్యత విషయంలో నిర్లక్ష్యం జరిగితే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేపు ఏదైనా అనుకోని ప్రమాదం చోటుచేసుకుంటే బాధ్యత ఎవరిదన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు భవనాన్ని సమగ్రంగా సాంకేతిక తనిఖీ చేయించి, నిర్మాణ నాణ్యతపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నాణ్యతా లోపాలు నిర్ధారణైతే సంబంధిత కాంట్రాక్టర్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## వైయస్ఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు నేటికి చెరపని ముద్ర దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే అధ్యాయం

### కోట్లాది మందికి ఆపద్బాంధవుడిగా నిలిచి, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన వైయస్ఆర్

### చరిత్ర మర్చిపోలేని పేరు.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన పేరు

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం




**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కేపిహెచ్బి బస్టాండ్‌లో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్, బాలాజీనగర్ లో డివిజన్ మాజీ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకి టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్యఅతిథిగా హాజరై డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసిన నాయకుడు ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయిన నాయకుడు వైఎస్సార్. ఆయనను కోల్పోయి 17 ఏళ్లు గడిచినా ప్రజల మనసుల్లో ఆయనపై ఉన్న అభిమానం మాత్రం చెరిగిపోలేదు అని అన్నారు. వైయస్ఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు నేటికి చెరపని ముద్ర దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే అధ్యాయం అని అన్నారు. పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించిన మహత్తర పథకం ఆరోగ్య శ్రీ. కోట్లాది మంది పేద బిడ్డలకు ఉచిత విద్యను అందించి చదువులకు బరోసా కల్పించిన పథకం ఫీజు రియంబర్స్మెంట్. ఉచిత విద్యుత్ ద్వారా రైతు సంక్షేమానికి, జలయజ్ఞంతో సాగునీటి రంగానికి సరికొత్త నడక నేర్పిన అపర భగీరథుడు వైయస్ఆర్. 108,104 అంబులెన్స్ సేవలు, రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ లాంటి ఎన్నో పథకాలు నేటికి చిరస్మరణీయమని పేర్కొన్నారు. జీవితంలో ఆఖరి గంటలు కూడా ప్రజా సంక్షేమం గురించే అలోచించిన మహానేత వైయస్ఆర్ అని అన్నారు. వైయస్ఆర్ ఆశయాలు, ప్రజా సంక్షేమ స్ఫూర్తిని కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, కేపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు అరవింద్ రెడ్డి, ఖైత్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కలికోట శంకర్, సీనియర్ నాయకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్, బి బ్లాక్ అధ్యక్షురాలు సంధ్య, మహిళా నాయకురాలు స్వరూప గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ ఫణి కుమార్, జహింగీర్, బచ్చు మల్లి, కల్పన, వాణి, సుజాత, యాదగిరి, జిబిన్, పిడికిటి గోపాల్ చౌదరి, మహిళా కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైయస్ఆర్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మోసంపై భద్రాచలంలో బీఆర్ఎస్ కదనభేరి..

### 500 బైకులతో భారీ నిరసన ర్యాలీ



**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 02:** ?భద్రాచలం పట్టణ వీధులు గులాబీ జెండాల రెపరెపలతో హోరెత్తాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, నూరు రోజుల గడువు తీరినా. వెయ్యి రోజులు కావచ్చిన. ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు భద్రాచలం నియోజకవర్గ వ్యాప్తంగా భారీ నిరసన బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 500 బైకులతో బీఆర్ఎస్ శ్రేణులు, యువత భారీ సంఖ్యలో తరలిరావడంతో పట్టణ ప్రధాన కూడళ్లు నినాదాలతో దద్దరిల్లాయి .అమలుకాని వాగ్దానాలు.. వెక్కిరిస్తున్న గ్యారెంటీలు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భద్రాచలం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌ఛార్జ్ మానే రామకృష్ణ, సీనియర్ నాయకుడు సునీల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, నేడు ప్రజలను నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీల్లో ఇప్పటివరకు ఎన్ని గ్యారెంటీలను పూర్తిగా అమలు చేశారో ప్రభుత్వం ప్రజలకు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి, రైతు భరోసా, మహిళలకు మహాలక్ష్మి పథకం నిధులు, పింఛన్ల పెంపు వంటి కీలక హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా ఈ ర్యాలీ చేపట్టామని నేతలు స్పష్టం చేశారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు నిరసనల పర్వం రాష్ట్రవ్యాప్త కార్యాచరణలో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయనున్నట్లు నాయకులు ప్రకటించారు. కాంగ్రెస్ సర్కారు మెడలు వంచి ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ అలుపెరగని పోరాటం చేస్తుందని హెచ్చరించారు. మండల, గ్రామ స్థాయిల్లో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన దీక్షలతో ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ బైక్ ర్యాలీతో భద్రాచలంలో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది.

## బడుగు, బలహీన వర్గాల కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయం

### పాపిరెడ్డి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి




**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని పాపిరెడ్డి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉట్ల చంద్ర రెడ్డి అన్నారు. మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా, తెట్టెబావి ఆనంద్ ఆధ్వర్యంలో శేర్లింగంపల్లి నియోజకవర్గం, పాపిరెడ్డినగర్ లో గల వైయస్సార్ విగ్రహానికి పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.చంద్ర రెడ్డి, సెంట్ ఆంటోనీ స్కూల్ ప్రిన్సిపల్ జీవన్ ప్రసాద్, కె.రమణా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఊట్ల చంద్ర రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, పేద ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన అనేక కార్యక్రమాల ద్వారా వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, మల్లికార్జున్, రాజేందర్, సుదర్శన్, ప్రసాద్, ప్రమోద్, ప్రభాకర్, ఆంజనేయులు, సత్య, విక్కీ, సునీల్, సులోచన తదితరులు పాల్గొని వైస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఘనంగా జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

### పవన్ కళ్యాణ్ పాలన ఆశయాలు పార్టీ సిద్ధాంతాలు నచ్చి ప్రతి పక్ష పార్టీల నాయకులు జనసేన వైపు మొగ్గు

### జనసేన పార్టీ తెలంగాణ లో బలపడుతుంది

### జనసేన పార్టీ జాయిన్ కమిటీ సభ్యులు: ముమ్మారెడ్డి ప్రేమ కుమార్




**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, కెపిహెచ్బి కాలని 5 వ ఫేస్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు, కుకట్ పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ జనశ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి అధినేతకు శుభాకాంక్షలు తెలిపి, మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గోపాల్ నగర్ లో యూత్ ఫోర్స్ వారు నిర్వహించిన బైక్ ర్యాలీ లో పాల్గొని రక్త దాన శిబిరంని ప్రారంభించి జనసైనికుల సమక్షంలో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ జనసైనికులు, కళ్యాణ్ అభిమానులు కూకట్ పల్లి నియోజకవర్గంలో రాత్రి నుండి పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్నారని, జనసేన పార్టీ తెలంగాణ లో బలపడుతుందని, పవన్ కళ్యాణ్ పాలన ఆశయాలు పార్టీ సిద్ధాంతాలు నచ్చి పాలక, ప్రతి పక్ష పార్టీల నుండి చోటా, బడా నాయకులు జనసేన పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తా... పెచ్చెట్టి మురళి రామకృష్ణారెడ్డి



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని కాలేయ మార్పిడి కి సంబంధించి వ్యాధితో బాధపడుతున్న బాలుడికి బీసీ యువసేన జాతీయ అధ్యక్షులు, శేర్లింగంపల్లి నియోజకవర్గం జనసేన నేత పెచ్చెట్టి మురళి రామకృష్ణారెడ్డి అండగా నిలిచారు. కూకట్ పల్లి సిబిసిఐడి కాలనీలో నిర్వహించిన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నేమూరి శంకర్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా బాలుడి తండ్రికి 50 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ తెలంగాణలో మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్ళనున్నామని రాబోయే కార్పొరేషన్ తో పాటు 2029 లో జరగబోయే ఎన్నికల్లో కూడా జనసేన పార్టీ పోటీ చేసి ఎమ్మెల్యేలను గెలిపించుకొని పవన్ కళ్యాణ్ కు బహుమతిగా అందజేస్తామని అన్నారు. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఎందరో ఇండ్లలో ఆయన వెలుగులు నింపారని రెండు ఏళ్లలోనే ఇంత చేస్తే ముఖ్యమంత్రిగా ఆయన ఉంటే మరింత అభివృద్ధి జరుగుతుందని ఆ దిశగా జనసైనికులు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు నేమూరి శంకర్ గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు.



## బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నలేని కృషి చేసిన మహా నాయకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి

### వై.ఎస్.ఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** పేదల పెన్నిధి, అభివృద్ధి ప్రదాత, జన హృదయాల్లో చెరగని ముద్రవేసి దివికెగిసిన నేత స్వర్గీయ డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కార్యాలయంలో వై.ఎస్.ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ రాజేశేఖర్ రెడ్డి బడుగు బలహీన వర్గాల కోసం ఎనలేని కృషి చేశారని, ఫీజు రియంబర్స్మెంట్, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, రచ్చబండ లాంటి ఎన్నో కార్యక్రమాలు తీసుకొచ్చి ప్రతి పేదవాడి గుండెలో ఆయన బ్రతికే ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, గోపాల్, పోశెట్టిగౌడ్, పాండుగౌడ్, షౌకత్ అలీ మున్నా, లింగం, సుధాకర్, శ్యామ్, ఇస్మాయిల్, ఖలీమ్, ఖాజా, గౌస్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తానని చెప్పి 1000 రోజులు దాటిన ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదు

### ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న మోసాలను ఆధారాలతో సహా బయటపడతాం

### బోయిన్‌పల్లిలోని స్థలాలను 22ఏ పరిధిలోకి తెచ్చి పేదలను కబ్జాదారులుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారు

### ప్రతీ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.5 లక్షలు బాకీ ఉంది

### కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు





**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** వంద రోజుల్లో అమలు చేస్తామంటూ 420 బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు దాటినా ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చకుండా ప్రజలను తీవ్రంగా వంచించిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్, స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. దమ్ము ధైర్యం ఉంటే ఎవరు పనిచేశారో, ఎవరు చేయలేదో ప్రజల సమక్షంలోనే తేల్చుకుందామని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రజలకు తిప్పలు తప్పడం లేదన్నారు. రూ.4 వేల పింఛను, ఒంటరి మహిళలకు నెలకు రూ.2,500, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు, తులం బంగారం వంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. గతంలో కేసీఆర్ పాలనలో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రూ.5 భోజనం, ఆడబిడ్డలకు గౌరవంగా బతుకమ్మ చీరలు అందించామని, నేడు ఆ సంక్షేమాన్ని కాంగ్రెస్ సర్కార్ తుంగలో తొక్కిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ ప్రచారం చేసుకుంటూ మరోవైపు వారి కుటుంబాలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. గత మూడేళ్లలో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.72 వేల వరకు బాకీ పడిందని, ప్రతీ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.5 లక్షలు బాకీ ఉందని పేర్కొంటూ ఈ వివరాలతో కూడిన 'బాకీ కార్డు'ను ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని స్పష్టం చేశారు. తమ హయాంలో బోయిన్‌పల్లి అభివృద్ధికి రూ.150 కోట్లు ఖర్చు చేశామని, రూ.100 కోట్లతో తాగునీటి వ్యవస్థను పటిష్టం చేసి 20 వేల లీటర్ల ఉచిత నీరు అందిస్తే.. నేడు ప్రజలకు నీటి బిల్లులు పంపుతూ ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 44 లక్షలతో అంబులెన్సులు సమకూరిస్తే తన ఫోటోలను తొలగించడం కాంగ్రెస్ చిల్లర రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. బోయిన్‌పల్లిలో మెజారిటీ స్థలాలను 22ఏ పరిధిలోకి తెచ్చి స్థానిక ప్రజలను, పేదలను కబ్జాదారులుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న మోసాలను ఆధారాలతో సహా బయటపెడతామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోయిని పల్లి మాజీ కార్పొరేటర్ ముద్ధం నర్సింహ యాదవ్, హరినాథ్, ఇర్ఫాన్, మక్కాల నర్సింగ్ రావు, నరేందర్ గౌడ్, ఎజాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

### కూకట్ పల్లి కెపిహెచ్బీ టెంపుల్ బస్‌స్టాప్‌లో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి

### ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేత వైఎస్ఆర్

### ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు


### కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, కెపిహెచ్బీ టెంపుల్ బస్‌స్టాప్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమం స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, పేద ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన అనేక కార్యక్రమాల ద్వారా వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని బండి రమేష్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ చూపిన ప్రజాసేవా స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజాపాలనను కొనసాగిస్తోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు, పేదలు, రైతులు, మహిళలు, యువత అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని బండి రమేష్ తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాలను, ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డిసిసి వైస్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర, కెపిహెచ్బీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అరవింద్ రెడ్డి, ఖైతలాపూర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కలికోట శంకర్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నాగార్జున, మాజీ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, సతీష్ గౌడ్, సీనియర్ నాయకులు గంధం రాజు, ఫణీంద్ర, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్ తదితర ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూసి దొంగనోట్ల తయారీ: ముఠా అరెస్ట్





గండిపేట(క్రైమ్ మిర్రర్): ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను చూసి నకిలీ కరెన్సీ తయారీ విధానాన్ని నేర్చుకుని, దొంగనోట్లను చలామణి చేస్తున్న ముఠాను శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో నకిలీ కరెన్సీతో పాటు తయారీకి ఉపయోగించిన పరికరాలు, ముడిసరుకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన రమావత్ రాము, రమావత్ మోతిలాల్, రమావత్ గాంధీ, సుధీర్ కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ నోట్ల తయారీకి పాల్పడ్డారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా నకిలీ కరెన్సీ తయారీకి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకున్న నిందితులు.. రూ.500, రూ.200, రూ.100 నోట్లను తయారు చేసి చలామణి చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాత్రి వేళల్లో మద్యం దుకాణాలు, పాన్‌షాపులను లక్ష్యంగా చేసుకుని నకిలీ నోట్లను చలామణి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నకిలీ కరెన్సీ చలామణిపై సమాచారం అందడంతో శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,19,100 విలువైన నకిలీ కరెన్సీ, కలర్ ప్రింటర్, లామినేటర్, ఇంక్ డబ్బాలు, నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించిన ఇతర ముడిసరుకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. నకిలీ కరెన్సీ తయారీకి సంబంధించిన రీల్స్‌ను సోషల్ మీడియాలో రూపొందించి ప్రచారం చేసే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువత సోషల్ మీడియాలో కనిపించే అనుమానాస్పద, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను అనుసరించవద్దని సూచించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యంపై బీఆర్ఎస్ మహా ధర్నా



గండిపేట(క్రైమ్ మిర్రర్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో భారీ నిరసన కార్యక్రమం, మహా ధర్నా నిర్వహించారు. శంషాబాద్ జీహెచ్ఎంసీ కొత్వాల్‌గూడ డివిజన్--118లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. నిరసన కార్యక్రమానికి 118, 119 డివిజన్లతో పాటు శంషాబాద్ మండలం, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నినాదాలు చేస్తూ మహా ధర్నాను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో 118వ డివిజన్ అధ్యక్షుడు కోలన్ ప్రదీప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, రాహుల్ అప్పా, ఉపాధ్యక్షులు మహేష్ యాదవ్, వెంకటేష్, హరి గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు అర్జున్, యూత్ ప్రెసిడెంట్ టిల్లు, కార్యదర్శి సుధాకర్, వేణు, శ్రీనివాస్, బాలరాజు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అలాగే మైనారిటీ సెల్ నాయకులు గౌస్, ఫయాజ్, మొహమ్మద్, జాకీర్‌తో పాటు సీనియర్ నాయకులు మంచర్ల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, రాజేందర్, హనుమంతు, జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

# ఫతేనగర్ సమస్యలపై ఎంపీ ఈటల రాజేందర్‌కు కంచి మహేందర్ వినతి

## బ్రిడ్జి నిర్మాణం, శ్మశానవాటిక అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి

## అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తా.. ఎంపీ ఈటెల రాజేందర్

**బాలానగర్, సెప్టెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ దృష్టికి బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ తీసుకెళ్లారు. ఫతేనగర్‌లో పర్యటించిన ఎంపీ ఈటల రాజేందర్‌కు స్థానిక సమస్యలను కాంచి మహేందర్ వివరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం కోరిన కాంచి మహేందర్ ఫతేనగర్‌లో చాలాకాలంగా స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బ్రిడ్జి సమస్యను కాంచి మహేందర్ ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్లారు. వంతెన సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ కూడా సమస్య తీవ్రతను ఎంపీకి వివరించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాల్సిన అవసరం ఉందని వారు కోరారు. స్థానికుల సమస్యలను సావధానంగా విన్న ఎంపీ ఈటల రాజేందర్ స్పందిస్తూ, బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలను త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు.



అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

**శ్మశానవాటిక సమస్యలపై ఎంపీకి వివరాలు**

అనంతరం కాంచి మహేందర్‌తో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ పాత విమానాశ్రయం ప్రాంతంలోని శ్మశానవాటికను సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో శ్మశానవాటిక అభివృద్ధి కోసం కొన్ని పనులు ప్రారంభమైనప్పటికీ అవి పూర్తికాకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రాలేదని కాంచి మహేందర్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ సమస్య పరిష్కారంపై తగిన శ్రద్ధ చూపడం లేదని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. శ్మశానవాటికలో మిగిలిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎంపీని కోరారు.

**అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తాం.. ఈటల రాజేందర్**

స్థానిక సమస్యలపై స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా బ్రిడ్జి నిర్మాణం, శ్మశానవాటిక అభివృద్ధి వంటి ప్రజలకు నేరుగా ఉపయోగపడే అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేసిన కాంచి మహేందర్‌కు స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ పర్యటనలో బీజేపీ సీనియర్ నాయకులు, ఫతేనగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మైలార్‌దేవ్‌పల్లిలో రౌడీషీటర్ దారుణ హత్య





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. మంగళవారం ఉదయం 6:50 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో పడి ఉన్నట్లు 100కు సమాచారం అందడంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకునే సమయానికి గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడిని అలీనగర్‌కు చెందిన కాజీ సోహెల్ (25)గా గుర్తించారు. మృతుడిపై మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో గతంలో హత్యాయత్నం సెక్షన్ 307తో పాటు మొత్తం నాలుగు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. అతనిపై రౌడీషీట్ కూడా ఉన్నట్లు వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తులో ప్రత్యర్థులు కాజీ సోహెల్‌పై దాడి చేసి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పాత కక్షలు, ప్రత్యర్థుల మధ్య వివాదాలే హత్యకు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు ద్వారా నిర్ధారించనున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ, హత్యకు గల కారణాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవతో కౌశలం సొసైటీలో రోడ్డు పనులు ప్రారంభం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ చొరవతో బైరాగిగూడలోని కౌశలం సొసైటీలో రూ.50 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నో రోజులుగా రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక నాయకులు హరీష్ గౌడ్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వు పత్రాలను కాలనీ ప్రతినిధులకు అందజేశారు. ఎమ్మెల్యే చొరవతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రతి విషయంలో సహకరిస్తూ, రోడ్డు పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల కాలనీ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు హరీష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, విజయభాస్కర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మూసాపేట్‌లో ఆరోగ్య సేవలకు జి ఎల్ ఆర్ ఏ చేయూత



**మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబు రావుతో సంస్థ ప్రతినిధుల భేటీ**


**కూకట్ పల్లి, సెప్టెంబర్ 02 (క్రైమ్ మిర్రర్) :** సమాజంలోని నిరుపేదలు, వెనుకబడిన వర్గాలు, వికలాంగులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు కుష్ఠు, క్షయ వ్యాధుల నివారణకు కృషి చేస్తున్న జర్మనీ లెప్రసీ అండ్ టిబి రిలీఫ్ అసోసియేషన్ ప్రతినిధులు మూసాపేట్ మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబు రావులను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ జర్మనీ డైరెక్టర్ జూలీతో పాటు భారతదేశ ప్రతినిధులు మాజీ కార్పొరేటర్లతో సమావేశమై సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కుష్ఠు, క్షయ వ్యాధుల నియంత్రణతో పాటు వికలాంగులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల ఆరోగ్యం, పునరావాసం కోసం సంస్థ అంతర్జాతీయ స్థాయిలో అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, జీవనోపాధికి తోడ్పాటు అందించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యాలని ప్రతినిధులు పేర్కొన్నారు. మూసాపేట్ పరిధిలో రానున్న రోజుల్లో ఆరోగ్య అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు మాజీ కార్పొరేటర్ల సహకారం అందించాలని కోరారు.

**ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు పూర్తి సహకారం**

ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబు రావు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం జర్మనీ లెప్రసీ అండ్ టిబి రిలీఫ్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా కుష్ఠు, క్షయ వ్యాధులపై అవగాహన కల్పించడం, అవసరమైన వారికి వైద్య సేవలు అందించడం వంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సంస్థ నిర్వహించే అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలకు తమ వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సంస్థ భారతదేశ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శిభు, ప్రాజెక్టు మేనేజర్ సుబీన్, సబితా రాణి, సతీష్, ఆనంద్, మల్లేష్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# బాకీ హామీలపై బీఆర్ఎస్ పోరుబాట

**ఎల్ఐజీ కాలనీలో "బాకీ కార్డుల" పంపిణీ చేసిన సింధు ఆదర్శ్‌రెడ్డి**





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 02:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన "కాంగ్రెస్ పార్టీ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట" కార్యక్రమంలో భాగంగా భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీ కాలనీలో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి "బాకీ కార్డులు" పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మహిళలకు నెలకు రూ.2,500, పెన్షన్లు, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, రైతు రుణమాఫీ, కల్యాణలక్ష్మి--షాదీముబారక్ కింద తులం బంగారం, ఫీజు రీయింబర్స్‌మెంట్, వరి పంటకు బోనస్, రైతు కూలీలకు ఆర్థిక సాయం తదితర పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. 33 నెలల పాలనలో బకాయిపడిన సంక్షేమ పథకాల నిధులను వెంటనే విడుదల చేసి, ఎన్నికల హామీలను అమలు చేయాలని సింధు ఆదర్శ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీల అమలు జరిగే వరకు బీఆర్ఎస్ ప్రజల తరపున నిరంతరం పోరాడుతుందని ఆమె తెలిపారు.

## పదోన్నతి పొందిన బీసీ డెవలప్‌మెంట్ అధికారిణి జి.జ్యోతికి కలెక్టర్ దివాకర టిఎస్ అభినందనలు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన జి. జ్యోతి బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టి.ఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్కను కలెక్టర్‌కు అందజేశారు. పదోన్నతి పొందిన జ్యోతికి కలెక్టర్ దివాకర టిఎస్ అభినందనలు తెలియజేసి, నూతన బాధ్యతల్లో మరింత సమర్ధవంతంగా సేవలందించాలనీ ఆకాంక్షించారు.




# మాదాపూర్--రాయదుర్గం ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలపై ఉన్నతస్థాయి సమీక్ష

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్ :** మాదాపూర్, రాయదుర్గం ఐటీ కారిడార్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, రోడ్డు భద్రత సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు ఐఏఎల్ఏ కార్యాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. టీ జీ ఐ ఐ సీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అధ్యక్షతన జరిగిన 2వ అడ్వైజరీ కమిటీ సమావేశానికి సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. యుటిలిటీ పనుల అనంతరం రోడ్లను వెంటనే పునరుద్ధరించడం, ఐటీ సంస్థల వద్ద ఓలా, ఉబర్ వంటి క్యాబ్ వాహనాలు రోడ్డుపై నిలిచిపోకుండా ప్రత్యేక హోల్డింగ్ ఏరియాలు ఏర్పాటు చేయడం, కీలక జంక్షన్ల వద్ద ఫ్రీ లెఫ్ట్ సౌకర్యం కల్పించడం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. అదేవిధంగా పాదచారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఫుట్‌పాత్‌లు, జీబ్రా క్రాసింగ్‌లు, అవసరమైన చోట సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సంబంధిత శాఖల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు. మాదాపూర్--రాయదుర్గం ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌ను మరింత సాఫీగా, సురక్షితంగా మార్చేందుకు టీజీఐఐసీ , ఐలా , ట్రాఫిక్ పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు.


# ఆమ్మో కేబుల్ వైర్ దొంగలు

## ఏడుగురు రైతుల బోర్ కేబుల్ వైర్స్ చోరీ...!



**క్రైమ్ మిర్రర్ కొందుర్గు :-** ఒక వైపు వర్షాలు లేక రైతులు విలవిలాడుతుంటే దొంగళకేమో పండుగ చేసినటుంది కొందుర్గు మండలం మహాదేవపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి బోరుబావుల వద్ద ఏడుగురు రైతుల బోర్ కేబుల్ వైర్స్ దొంగతనం చేస్తూ హల్ చెల్ సృష్టించారు కేటుగాళ్ళు. ఉదయం పొలం వద్దకు వెళ్లి చుసిన రైతులు బి. కిష్టయ్య.వెంకయ్య.సుధాకర్ రెడ్డి. జంగారెడ్డి, బీరయ్య లు సంఘటన చూసి ఆవేదనకు గురయ్యారు. ఈ కేబుల్ విలువ దాదాపు ఇరవై వేయిలకు పైగా ఉంటుంది అని ఈ యొక్క చోరీ చేసిన దొంగలు ఇక్కడ పగలు రెక్కి నిర్వహించి రాత్రి సమయంలో దొంగ తనం చేసి ఉంటారని రోడ్ కు ప్రక్కన ఉన్న మోటార్ కేబుల్ వదిలేసి గ్రామానికి దూరంగా ఉన్న రైతు మోటార్ కేబుల్ దొంగిలించుడం అనేది దాదాపు చుట్టూ ప్రక్కల గ్రామాల లోని కొందరి కేటుగాళ్ల పని అయి ఉండవచ్చు ఈ ప్రాంతం గురించి పూర్తి అవగాహన ఉన్న దొంగల పనే అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు..గత నెల రోజుల క్రితం కూడా మహాదేవ్ పూర్ శివార్లో నలుగురి రైతుల కేబుల్ వైర్ దొంగతనం జరగగా కొందుర్గు పోలీసులకు సమాచారం ఇచ్చి నట్టు సదరు రైతులు తెలిపారు.

# మనస్థాపంతో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 2 (క్రైమ్ మిర్రర్):** కుటుంబంలో ఏర్పడిన మనస్పర్థలు, మానసిక మనస్థాపంతో ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భగత్ సింగ్ నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి పిన్నింటి బుచ్చయ్య కుమారుడు పిన్నింటి మహేందర్ (38) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అతడికి పెళ్లి సంబంధాలు కుదరకపోవడానికి ఇల్లు లేకపోవడమే కారణమని భావించేవాడు. ఇటీవల అతడి తండ్రి గద్దె రాగడి ప్రాంతంలో ఒక ఇల్లు కొనుగోలు చేయగా, ఆ ఇంటిని తన పేరిట రాయాలని మహేందర్ తరచూ ఇంట్లో గొడవపడేవాడు. మంగళవారం రాత్రి కూడా ఈ విషయమై కుటుంబ సభ్యులతో గొడవపడి బయటకు వెళ్లిన మహేందర్, ఇంటి బయట మంచంపై కూర్చొని గొడవపడ్డాడు. అనంతరం రాత్రి 10:45 గంటల ప్రాంతంలో సింగరేణి విధులకు వెళ్లేందుకు తండ్రి బుచ్చయ్య లేచి చూడగా, ముందు తలుపులు రాకపోవడంతో కిటికీలోంచి పరిశీలించాడు. అక్కడ మహేందర్ ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే వెనుక తలుపుల గుండా బయటకు వచ్చి చూడగా అప్పటికే అతడు మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి బుచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీధర్ వెల్లడించారు.

# రూ.2 లక్షల నగదు బదిలీ వెంటనే ప్రారంభించాలి

### 100 రోజుల్లో ఇస్తామన్నారు.. 1,000 రోజులు గడిచినా అమలు చేయలేదు

### గొల్ల కుర్మలను ఓటు బ్యాంకుగా చూడటం సరికాదు

### జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెపురం రాజు



**గుండాల,( క్రైమ్ మిర్రర్):** గొల్ల కుర్మలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ( జిఎంపిఎస్ ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మద్దెపురం రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 100 రోజుల్లో గొల్ల కుర్మల ఖాతాల్లో రూ. 2 లక్షలు నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిఎంపిఎస్ ఆధ్వర్యంలో బండకొత్తపల్లి గ్రామంలో గొర్రెలు, మేకల పెంపకందారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మద్దెపురం రాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2017లో ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకంలో రెండో విడత కింద యాదాద్రి భువనగిరి జిల్లాకు 13 వేల యూనిట్లు రావాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నగదు బదిలీ ద్వారా ప్రతి లబ్ధిదారుడి ఖాతాలో రూ. 2 లక్షలు జమ చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ 1,000 రోజులు గడిచినా హామీ అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా గొల్ల కుర్మల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు.

**అవినీతి పేరుతో పథకాన్ని నిలిపివేయడం సరికాదు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీ పథకంలో రూ. 700 కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలపై గొర్రెల పంపిణీని రెండున్నర సంవత్సరాలుగా నిలిపివేయడం సరికాదన్నారు. అవినీతి ఆరోపణలపై విచారణను వేగవంతం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో అర్హులైన గొర్రెలు, మేకల పెంపకందారులకు పథక ప్రయోజనాలు అందించాలని కోరారు.

**ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి**

గొర్రెలు, మేకల పెంపకందారులు పోరాడి సాధించుకున్న 559, 1016, 64 జీవోలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న 42 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రస్తుతం పనిచేస్తున్న వెటర్నరీ వైద్యులు గొర్రెల కాపరులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పశువైద్యశాలల్లో అమ్మతల్లి, చిటుక వంటి వ్యాధులకు అవసరమైన టీకాలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యల పరిష్కారం కోసం జిఎంపిఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

**హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి**

ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తమ వాటా కోసం గొల్ల కుర్మలు ఐక్యంగా ఉద్యమించాలని మద్దెపురం రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సొసైటీ అధ్యక్షులు ననుబోతు కిష్టయ్య, ననుబాల శేఖర్, గణేష్, ప్రశాంత్, యాకన్న, ఎల్లయ్య, వెంకటయ్య, కొండయ్య, యాదయ్య, నర్సయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.




## సైబరాబాద్ లో అనధికార నిర్మాణాలపై సీఎంసీ కొరడా....

### పది రోజుల్లో 154 కూల్చివేతలు....


**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలపై అధికారులు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ ముమ్మరం చేశారు. సీఎంసీ కమిషనర్ డాక్టర్ బి. సృజన ఆదేశాల మేరకు మూడు జోన్ల పరిధిలో ప్రతిరోజూ క్షేత్రస్థాయి తనిఖీలు చేపడుతున్నారు.ఆగస్టు 24 నుండి సెప్టెంబర్ 2 వరకు మొత్తం 154 అనధికార నిర్మాణాలపై కూల్చివేత చర్యలు చేపట్టారు.శేరిలింగంపల్లి జోన్ - 69, నార్సింగిలో అత్యధికంగా 28, మియాపూర్‌లో 15 కూల్చివేతలు,కూకట్‌పల్లి జోన్ - 33: మాదాపూర్, ఆల్విన్ కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్లలో చర్యలు,కుత్బుల్లాపూర్ జోన్ - 52: గాజులరామారంలో 10, జీడిమెట్లలో 9, కొంపల్లిలో 9, నిజాంపేట్‌లో 8 చర్యలుకాగా నిన్న మంగళవారం (సెప్టెంబర్ 1) ఒక్కరోజే 36 అనధికార నిర్మాణాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 26 నిర్మాణాలను కూల్చివేశారు. మరో 10 నిర్మాణాలకు నోటీసులు జారీ చేయగా, ఒక నిర్మాణాన్ని సీజ్ చేశారు. నిన్నటి కూల్చివేతల్లో శేరిలింగంపల్లి జోన్‌లో 8, కూకట్‌పల్లి జోన్‌లో 7, కుత్బుల్లాపూర్ జోన్‌లో 11 ఉన్నాయి.భవన నిర్మాణ నిబంధనల అమలును కచ్చితంగా నిర్ధారించేందుకు ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు బుధవారం సాయంత్రం మణికొండ, నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్ల పరిధిలో పరిష్కారం కాని ప్రజా సమస్యలపై ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. మర్రిచెట్టు వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మణికొండ, నెక్నాంపూర్ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పరిష్కారం కాని పలు ప్రజా సమస్యలను ఛార్జ్‌షీట్‌లో ప్రస్తావించారు. పుప్పలగూడ అంబేద్కర్ భవనం, శ్మశానవాటిక రహదారి, బుల్కాపూర్ నాలా, కొత్తగా నిర్మించిన మున్సిపల్ భవనం, క్రికెట్ గ్రౌండ్ నిర్మాణానికి నిధుల విడుదల వంటి అంశాలను ప్రధానంగా పేర్కొన్నారు. అలాగే ఆస్తిపన్ను పాత పద్ధతిని కొనసాగించడం, భూగర్భజలాలు--మురుగునీటి పారుదల పైప్‌లైన్‌కు చేసిన ఖర్చుల వివరాలు వెల్లడించడం, రహదారుల విస్తరణ, విద్యుత్ స్తంభాలను రహదారుల నుంచి పక్కకు మార్చడం వంటి సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెమలి నగర్ వాసులకు ఇంటి నంబర్లు కేటాయించడం, చిత్రపురి కాలనీకి సంబంధించిన ఖాళీ స్థలాల దస్తావేజుల వివరాలను వెల్లడించడం, అలకాపూర్ టౌన్‌షిప్‌లో ప్రజా ప్రయోజన కార్యక్రమాలను చేపట్టడం వంటి అంశాలపై కూడా బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

## ఘనంగా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కే.ఎస్.రత్నం జన్మదిన వేడుకలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కే.ఎస్.రత్నం జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి కే.ఎస్.రత్నంను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కే.ఎస్. రత్నంకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరింత కాలం కొనసాగుతూ ప్రజలకు సేవలందించాలని వారు ఆకాంక్షించారు.

## వైద్య కళాశాల, జీజీహెచ్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

### రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 02:** జిల్లాలో వైద్య, ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ మెడికల్ కళాశాల, జీజీహెచ్, నర్సింగ్ కళాశాలల్లో మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరచాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి వైద్య ఆరోగ్యం, జీజీహెచ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కళాశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, పరికరాలు, పారిశుద్ధ్యం, భద్రత, నిర్వహణ, పెండింగ్ పనులపై సమీక్షించారు. జీజీహెచ్‌కు వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరాయంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలోని వైద్య పరికరాల పనితీరు, మరమ్మతులు, అదనంగా అవసరమైన పరికరాల వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. మెడికల్, నర్సింగ్ కళాశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ నెల 17న సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, నర్సింగ్ హాస్టల్, మెడికల్ కళాశాల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో మిగిలిన పనులు, పరికరాల ఏర్పాటు, సిబ్బంది నియామకాలకు సంబంధించిన చర్యలను పూర్తి చేసి నెలాఖరులోగా సిద్ధం చేయాలని సూచించారు.

**సింగూర్ కాలువల పనులు వేగవంతం చేయాలి**

సింగూర్ ప్రాజెక్టు పరిధిలోని కాలువల లైనింగ్, కట్ట మరమ్మతు పనులు, నీటి నిల్వ పరిస్థితులపై మంత్రి సమీక్షించారు. కాలువల లైనింగ్, కట్ట మరమ్మతు పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, కాలువల పరిరక్షణకు అవసరమైతే పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అభివృద్ధి పనులన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, సబ్ కలెక్టర్ ఉమాహారతి, డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, మెడికల్, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మైనార్టీ మహిళలకు అండగా ప్రభుత్వం..

### నియోజకవర్గంలో 95 మందికి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకంలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మైనార్టీ శాఖమంత్రి అజారుద్దీన్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని నియోజకవర్గానికి చెందిన మైనార్టీ సోదరీమణులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ పథకం కింద రాజేంద్రనగర్ నియోజకవర్గానికి మొత్తం 95 చెక్కులు మంజూరయ్యాయి. లబ్ధిదారులైన ప్రతి మహిళకు ప్రభుత్వం రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీ మహిళల ఆర్థిక సాధికారత, వారి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సి పట్నం మహేందర్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే , షాద్నగర్ ఎమ్మెల్యే , జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మైనార్టీ మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ 17వ వర్ధంతి.. శంకర్‌పల్లిలో కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళులు




**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా శంకర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నేతలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ తన ఐదేళ్ల ముఖ్యమంత్రి పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు, పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి విప్లవాత్మక పథకాలను అమలు చేశారని కొనియాడారు. మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మడపతి చంద్ర మౌళి మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో అనేక మంది ప్రాణాలను కాపాడేందుకు 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌దేనని అన్నారు. 'మాట తప్పని.. మడమ తిప్పని' నాయకుడిగా ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజా ప్రస్థానం పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వారికి మరింత చేరువయ్యారని తెలిపారు. వైఎస్సార్ భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాల ద్వారా నేటికీ ప్రజల హృదయాల్లో జీవించే ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చేకూర్త గోపాల్ రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ జూలకంటి శ్వేత పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.